PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక
# ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక

విలేకరులు కావలెను.
నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ
పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న
నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు
నియోజకవర్గ ఇన్‌చార్జులు,
మండల విలేకరులు కావలెను
సంప్రదించవలసిన నెంబర్లు
8074596109, 9676747256

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 110 | 02 ఆదివారం ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari

# అడ్రస్ లేకుండా పోయారు






మిగతా 2 లో

- హేళన చేసిన వారు అడ్రస్ లేకుండా పోయారు
- కష్టాల్లో ఉన్న ఏపిని ఆదుకున్న ప్రధాని మోడీ
- పోలవరం, రైల్వేజోన్, విశాఖ ఉక్కును కాపాడిన ప్రధాని
- ఉత్తరాంధ్ర దిశ మారబోతోందని చంద్రబాబు వెల్లడి

## ఉత్తరాంధ్ర...
# ఇకపై ఉత్తమ ఆంధ్ర...



భోగాపురం, ఆగస్టు 1 (ప్రజా సీమ)

ఉత్తరాంధ్ర ఇకపై అభివృద్ధిలో ఉత్తమ ఆంధ్రగా ఉండబోతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవంతో ఉత్తరాంధ్ర దశ-దిశ మారబోతోందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది పలికినట్టేనని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. విజయనగరం జిల్లా భోగాపురంలో శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. భోగాపురం విమానాశ్రయం కోసం భూములు ఇచ్చిన రైతులే ఉత్తరాంధ్ర కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. ...మిగతా 2 లో...

## ఈ20 పెట్రోల్‌పై కేజ్రీవాల్ యుద్ధం:

'అధ్యయనం లేదు.. స్పష్టత లేదు' అంటూ తీవ్ర విమర్శలు

- ఇలాంటి నిర్ణయాల వల్ల ప్రజలు నష్టపోతారన్న కేజ్రీవాల్
- వాహనాల మైలేజ్ గణనీయంగా పడిపోతుందని ఆందోళన
- ఈ20 విధానం ఏమాత్రం శ్రేయస్కరం కాదని వ్యాఖ్య

కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా వేగంగా అమలు చేస్తున్న ఈ20 (20 శాతం ఇథనాల్ కలిపిన) పెట్రోల్ విధానంపై ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు. సరైన అధ్యయనాలు, స్పష్టమైన ప్రణాళికలు లేకుండానే ఈ విధానాన్ని ప్రజలపై బలవంతంగా రుద్దుతున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖల మధ్యే ఈ విషయంపై ఎలాంటి సమన్వయం, స్పష్టత లేవని ఆయన ఎద్దేవా చేశారు.


...మిగతా 2 లో...



## అజిత్ దోవల్‌కు లోక్‌మాన్య తిలక్ జాతీయ పురస్కారం:
### అమిత్ షా చేతుల మీదుగా ప్రధానం

- పుణేలో తిలక్ 106వ జయంతి సందర్భంగా పురస్కారం అందజేత
- కార్యక్రమంలో పాల్గొన్న ఫడ్నవిస్, ఏక్ నాథ్ షిండే, సునేత్ర పవార్
- జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో పాటు రూ. 1 లక్ష నగదు బహుమతి

దేశ భద్రత, కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్లలో తిరుగులేని సేవలు అందించిన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌ను 'లోక్‌మాన్య తిలక్ జాతీయ అవార్డు' వరించింది. మహారాష్ట్రలోని పుణేలో ఈరోజు బాలగంగాధర్ తిలక్ 106వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అజిత్ దోవల్‌కు అందజేశారు. ...మిగతా 2 లో...





## క్షమాపణలు కాదు... కేసుల ఎత్తివేతపై మాట్లాడండి

- ప్రధాని మోడీ క్షమాపణలపై అభిజిత్ దీప్కే ప్రశ్నలు

న్యూఢిల్లీ,ఆగస్ట్1(ప్రజా సీమ): విద్యార్థులను క్షమిస్తున్నట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటించిన నేపథ్యంలో, కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'రీల్‌లో మాత్రమే క్షమిస్తారా?

## లోకేశ్‌కు ప్రధాని అభినందనలు

- బాగా పనిచేస్తున్నావంటూ కితాబు

విజయనగరం,ఆగస్ట్1 (ప్రజా సీమ): భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ.. ఏపీ విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమం ముగిసిన తర్వాత ప్రధానికి వీడ్కోలు పలికేందుకు వచ్చిన లోకేశ్ భుజం తట్టి.. 'నువ్వు చాలా బాగా పనిచేస్తున్నావు.. శభాష్ లోకేశ్' అని ప్రశంసించారు. భోగాపురం విమానాశ్రయం వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ప్రారంభోత్సవం విజయవంతంగా నిర్వహించడంలో రాష్ట్ర ప్రభుత్వ సమన్వయంపై కూడా ప్రధాని సంతృప్తి వ్యక్తం చేశారు. నారా లోకేశ్ పనితీరును ప్రధాని మోదీ మెచ్చుకోవడం ఇదేం తొలిసారి కాదు. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాని పాల్గొన్న పలు ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడంలో లోకేశ్ కీలక పాత్ర పోషించిన సందర్భాల్లోనూ మోదీ ఇదే తరహాలో ఆయనను అభినందించారు. ముఖ్యంగా 'యోగాంధ్ర' కార్యక్రమం ద్వారా ప్రపంచ రికార్డు స్థాయిలో యోగా నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఏర్పాట్లపై ప్రధాని ప్రశంసలు కురిపించారు. తాజాగా భోగాపురం పర్యటన సందర్భంగా మరోసారి లోకేశ్‌ను ఆప్యాయంగా అభినందించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ప్రధాని సూచించిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.



# ఎర్రబస్సు రాదన్న చోటకు ఎయిర్ బస్సు వచ్చింది

ఇదీ ఉత్తరాంధ్ర దెబ్బ... అర్థమైందా రాజా
మోదీజీ వికసిత్ భారత్... సీబీఎన్ విజన్ ప్రతిరూపం
భోగాపురం ఎయిర్ పోర్ట్ మంత్రి లోకేష్

విశాఖపట్నం, ఆగస్టు 1 (ప్రజా సీమ)

'కొందరు ఎర్రబస్సు రాని ఊరికి విమానాశ్రయం అవసరమా అని అన్నారు. ఉత్తరాంధ్రను తక్కువగా అంచనా వేసి ఇక్కడి ప్రజలను అవమానించిన వాళ్లకి ఈరోజు దిమ్మ తిరిగే సమాధానమే అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం. ఎర్రబస్సు రాదు అన్న చోటకి ఎయిర్ పోర్ట్ వచ్చింది. ...మిగతా 2 లో...



## ధింసా నృత్యం నన్ను కదిలించింది

- ఎక్స్ వేదికగా ప్రధాని మోడీ పోస్ట్

న్యూఢిల్లీ,ఆగస్ట్1(ప్రజా సీమ): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించి, జాతికి అంకితం చేశారు.



# దేశాన్ని వికసిత్ భారత్‌గా నడిపిస్తున్న మోడీ

- భారత్ ప్రగతిపథంలో పయనించడానికి అహర్నిశలు శ్రమ
- చంద్రబాబు మార్గదర్శకత్వంలో అగ్రగామిగా ఆంధ్రా

విజయనగరం,ఆగస్ట్1(ప్రజా సీమ)



140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సాకారం చేస్తున్నారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవంలో పవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. భారత్‌ను ప్రగతి పథంలో వేగంగా నడిపిస్తున్న నేత ప్రధాని మోదీ అని తెలిపారు. దేశాన్ని మోదీ వికసిత్ భార గుణం మోదీది అని చెప్పుకొచ్చారు. తెలుగుజాతి ఎవరికీ తలవంచదని అల్లూ వెల్లడించారు. దేశ ప్రగతికి మౌలిక వసతుల కల్పనే కీలకమని ప్రధాని మోదీకి తెలుసన్నారు. రైల్వే జోన్ ఇచ్చి ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. దేశ ప్రగతికి మౌలిక వసతుల కల్పనే కీలకమని ప్రధానికి తెలుసు. అందుకే.. రైల్వే జోన్ ఇచ్చి ఇక్కడి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చారు. ఈ దేశాన్ని వికసిత్ భారత్ దిశగా నడిపిస్తున్నారు. కష్టపడి పనిచేస్తున్న ప్రధానికి చాలా అవమానాలు ఎదురయ్యాయి. దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలంటే ఎంత కష్టమో ఆలోచించాలి. ఢిల్లీ జంతర్‌మంతర్‌లో ప్రధానిని విమర్శిస్తుంటే చాలా బాధపడ్డా. ఎన్ని బాధలు పడ్డా.. వెనక్కి లాగుతున్నా.. మోదీ ఎక్కడా భయపడలేదు. కాయలు కాసే చెట్టుకే రాళ్ల దెబ్బలు తగలడం సహజం. తనను దూషించే వారిని కూడా క్షమించే గుణం మోదీది. సెలవు తీసుకోకుండా పనిచేస్తున్న ప్రధానికి మనం ఏం ఇవ్వగలం.

# ఉత్తరాంధ్ర...ఇకపై ఉత్తమ ఆంధ్ర...

మొదటిపేజీ తరువాయి

భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మణిహారమని, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరును విమానాశ్రయానికి పెట్టడం గర్వకారణమన్నారు. ఉత్తరాంధ్రకు చెందిన జీఎంఆర్ సంస్థ నిర్మించిన ఈ విమానాశ్రయం ప్రాంత సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటుతోందన్నారు. ఈ ప్రాజెక్టుకు పునాది వేసిన మాజీ కేంద్ర మంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజు, ప్రస్తుతం కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఇద్దరూ ఉత్తరాంధ్ర వారేనని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. సముద్రం, కొండల నడుమ నిర్మితమైన భోగాపురం విమానాశ్రయం దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందుతుందని చెప్పారు. విశాఖ నుంచి భోగాపురం వరకు బీచ్ కారిడార్ నిర్మిస్తున్నామని, శంషాబాద్ విమానాశ్రయం తెలంగాణ రూపురేఖలు మార్చినట్లే భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర దశ, దిశను మార్చబోతోందని ముఖ్యమంత్రి అన్నారు. ప్రధాని మోదీ సహకారంతో... కేంద్రం అందిస్తున్న తోడ్పాటుతో గత రెండేళ్లలో ఉత్తరాంధ్రలో 189 ప్రాజెక్టులకు రూ.6.13 లక్షల కోట్ల పెట్టుబడులు సమీకరించామని, వాటి ద్వారా 5.57 లక్షల ఉద్యోగాలు వస్తాయని సీఎం తెలిపారు. ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు సెంటిమెంట్ నిలబెట్టింది ప్రధాని నరేంద్ర మోదీనేనని చెప్పారు. అలాగే విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు ప్రత్యేక ఆర్థిక వెసులుబాటు కలిగించి...స్టీల్ ప్లాంట్ పునర్ వైభవం సాధించేలా ప్రధాని సహకరిస్తున్నారని సీఎం తెలిపారు. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు ప్రధాని సహకరించారన్నారు. మూడేళ్లల్లో రూ.2,784 కోట్లతో 8 సాగునీటి ప్రాజెక్టులు పూర్తవుతాయని, 65 ఏళ్లుగా పెండింగులో ఉన్న నేరడి బ్యారేజీకి అనుమతులు వచ్చాయని... దానికి నిధులు కేటాయించామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ నెల 14న గోదావరి నీటిని అనకాపల్లికి తీసుకువస్తామని, వంశధార?గోదావరి అనుసంధానం కూడా చేపడతామని వెల్లడించారు. పర్యాటకం, ఫార్మా, రేర్ ఎర్త్ ఖనిజాలు, జాతీయ రహదారులు, ఆధ్యాత్మిక పర్యాటకానికి ఉత్తరాంధ్ర కేంద్రంగా మారుతుందని చెప్పారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి మారి, భవిష్యత్తులో ఉత్తరాంధ్రకే వలసలు వచ్చే రోజులు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు.విశాఖ ఉక్కు పరిరక్షణ, విశాఖ రైల్వే జోన్, పోలవరం, అమరావతికి కేంద్ర సహకారం అందించిన ప్రధాని మోదీకి సీఎం కృతజ్ఞతలు తెలిపారు. 2027 నాటికి పోలవరం పూర్తిచేసి ప్రధాని చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని, అలాగే 2028 నాటికి అమరావతి తొలి దశను పూర్తి చేసి ప్రధానితో ప్రారంభింప చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. రెండేళ్ల క్రితం విధ్వంసమైన రాష్ట్రాన్ని ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తాను, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కలిసి పునర్నిర్మిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని చెప్పారు. ఒకప్పుడు "ఎర్రబస్సే రాదు" అని వెక్కిరించిన చోట నేడు ప్రపంచస్థాయి ఎయిర్‌బస్ దిగుతోందని, అభివృద్ధిని అడ్డుకున్నవారు అడ్రస్ లేకుండా పోయారని వ్యాఖ్యానించారు. ప్రపంచం ఐటీ నుంచి ఏఐ వైపు అడుగులు వేస్తున్న సమయంలో దేశానికి ప్రధాని మోదీ లాంటి సమర్థ నాయకుడు అవసరం ఉందని సీఎం అన్నారు. డిజిటల్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్, ఆయుష్మాన్ భారత్, జల్ జీవన్ మిషన్ వంటి కార్యక్రమాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్‌ను నాలుగో స్థానానికి తీసుకొచ్చారని కొనియాడారు. ప్రపంచ దేశాల ముందు భారతదేశ ఔన్నత్యాన్ని చాటి చెప్పిన నాయకుడు మోదీనేనని అన్నారు. ప్రపంచంలో వివిధ ప్రాంతాల్లో జరుగుతన్న యుద్ధాల వల్ల భారత దేశంపై ఆ ప్రభావం పడకుండా చూడడంలో ప్రధాని మోదీ సక్సెస్ అయ్యారని గుర్తు చేశారు. వివిధ దేశాల ప్రజలు సరైన నాయకత్వం కోసం.. సరైన నాయకుడు కోసం ఎదురు చూస్తున్న తరుణంలో... భారత దేశానికి మోదీ రూపంలో అద్భుతమైన నాయకత్వం లభించిందని... ఇది దేశ ప్రజల అదృష్టమన్నారు. క్లిష్ట కాలంలో కూడా 144 కోట్ల భారత ప్రజల ఆశలు, ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో ప్రధాని మోదీ ఒక్కరి వల్లే సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చెప్పారు. మోదీని విమర్శించే వారికి కూడా ఆయన చేసిన మంచి... దేశానికి చేసిన సేవలు తెలుసని చెప్పారు. ప్రధాని మోదీకి దేశ ప్రజలందరూ అండగా నిలవాల్సిన అవసరం ఉందని చెప్పారు. తన ఐదు దశాబ్దాల రాజకీయ జీవితంలో నరేంద్ర మోదీ వంటి నాయకుణ్ని చూడలేదని, "రైట్ టైమ్... రైట్ ప్లేస్... రైట్ మ్యాన్" మోదీయేనని వ్యాఖ్యానించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ టెర్మినల్‌ను ప్రారంభించిన అనంతరం చెక్-ఇన్ హాల్, ఆధునిక ప్రయాణికుల సదుపాయాలు, సాంకేతిక వ్యవస్థలను పరిశీలించారు. విమానాశ్రయ మాస్టర్ ప్లాన్, ఏవియేషన్ హబ్, ఏవియేషన్ ఎడ్యుసిటీ నమూనాలను జీఎంఆర్ ప్రతినిధులు వివరించారు. టెర్మినల్‌లో ఏర్పాటు చేసిన భారీ వీడియో వాల్‌లో ప్రదర్శించిన ఉత్తరాంధ్ర చరిత్ర, ప్రముఖ పుణ్యక్షేత్రాలు, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానమంత్రికి వివరించారు. విమానాశ్రయ ప్రాంగణంలోని తెలుగు కళా సంపదను ప్రతిబింబించే కళాఖండాలను ప్రధాని ఆసక్తిగా తిలకించారు. టెర్మినల్ నుంచి ఓపెన్‌టాప్ జీపులో సభా వేదికకు చేరుకునే మార్గం మధ్యలో గిరిజన మహిళలు.. విద్యార్థినులు చేసిన థింసా నృత్యంతో ప్రధాని నరేంద్ర మోదీకి స్వాగత పలికారు. సభా ప్రాంగణానికి చేరుకున్న ప్రధానమంత్రికి ప్రజలు జాతీయ జెండాలు ఊపుతూ కరతాళధ్వనులతో స్వాగతం పలికారు. సభా వేదికపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పొందూరు ఖాదీ శాలువాతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఘనంగా సత్కరించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ కలిసి ఉత్తరాంధ్ర కళా వైభవానికి ప్రతీక అయిన బొబ్బిలి వీణను ప్రధానమంత్రికి జ్ఞాపికగా అందజేశారు. ఓపెన్ టాప్ జీపులో ప్రధాని మోదీ వెంట ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఉన్నారు. వేదికపై గవర్నర్ అబ్దుల్ నజీర్, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస వర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.రాత్రింబవళ్లు కష్టపడి పరిశ్రమలను ఆకర్షించేందుకు సీఎం చంద్రబాబు చేస్తున్న కృషి ఫలితంగానే రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వస్తున్నాయని ప్రధాని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డబుల్ ఇంజిన్ సర్కార్‌లో కీలక భాగస్వాములుగా ఉన్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లతో సమన్వయం చేసుకుంటూ పని చేస్తున్నామని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. పెట్టుబడులు?ఉపాధి?అభివృద్ధి అనే లక్ష్యంతోనే ఎన్డీఏ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రధాని అన్నారు. పెట్టుబడులు పెరిగితే ఉత్పత్తి పెరుగుతుందని, ఉత్పత్తి పెరిగితే ఎగుమతులు పెరుగుతాయని, ఎగుమతులు పెరిగితే ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని, చివరికి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. అదే అభివృద్ధి నమూనాను ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం వేగవంతమైన అభివృద్ధి దిశగా దూసుకుపోతోందని ప్రధాని మోదీ ప్రశంసించారు.

# ఉత్తరాంధ్ర కలలకు రెక్కలొచ్చాయ్

మొదటిపేజీ తరువాయి

**విజయనగరం,ఆగస్ట్ 1(ప్రజా సీమ):** భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభంతో ఉత్తరాంధ్ర కలలకు రెక్కలొచ్చాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయడు వ్యాఖ్యానించారు. కష్టాల్లో ఉన్న ఏపీకి ప్రధాని మోదీ ఆక్సిజన్ ఇచ్చారని కొనియాడారు. రాజధాని అమరావతికి నిధులు ఇచ్చి ప్రధాని అండగా నిలిచారని ఉద్ఘాటించారు. పోలవరం, రైల్వేజోన్, విశాఖ ఉక్కును మోదీ కాపాడారని ప్రశంసించారు. ఎయిర్‌పోర్ట్‌కు భూములు ఇచ్చిన రైతులకు పాదాభివందనాలు చేస్తున్నానని పేర్కొన్నారు. ఏపీని పునర్‌నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చామని.. చేస్తున్నామని స్పష్టం చేశారు. భోగాపురం ఎయిర్‌పోర్టును ప్రధాని మోదీ ప్రారంభించిన కార్యక్రమంలో పాల్గొని సీఎం చంద్రబాబు ప్రసంగించారు. ఈ ప్రాంతానికి ఎర్రబస్సు కూడా రాదని కొందరు హేళన చేశారని సీఎం విమర్శించారు. అవహేళన చేసినవారు అడ్రస్ లేకుండా పోయారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఉత్తరాంధ్రలో సరికొత్త చరిత్రకు నాంది పలికామని ఉద్ఘాటించారు. గూగుల్, స్టీల్ కంపెనీలతోపాటు చాలా సంస్థలు వచ్చాయని వివరించారు. ఉత్తరాంధ్ర దశ, దిశ మారబోతున్నాయని వెల్లడించారు. రెండేళ్ల క్రితం విధ్వంసమైన రాష్ట్రాన్ని చూశామని పేర్కొన్నారు. ప్రధాని మోదీ సహకారంతో ఉత్తరాంధ్రలో 189 ప్రాజెక్టులకు పెట్టుబడులు రాబోతున్నాయని వివరించారు. ఉత్తరాంధ్రలో అన్నిరకాల వనరులు ఉన్నాయని వెల్లడించారు. ఉత్తరాంధ్ర నుంచి వలసలు తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. ఇక్కడికే ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చేలా చేస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. దేశాన్ని మోదీ 12 ఏళ్లుగా సమర్థంగా నడిపిస్తున్నారని సీఎం కొనియాడారు. దేశాన్ని డిజిటల్ ఇండియాగా మార్చే ఘనత మోదీదేనని ప్రశంసల వర్షం కురిపించారు. సౌరశక్తి, గ్రీన్ హైడ్రోజన్ ద్వారా కాలుష్యం తగ్గిస్తున్నారని తెలిపారు. దేశంలో తీవ్రవాదం, నక్సలిజం లేకుండా చేశారని చెప్పుకొచ్చారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం సుభిక్షంగా ఉందని వెల్లడించారు. మోదీ లాంటి నేతను తన రాజకీయ జీవితంలోనే చూడలేదని అన్నారు. నేషన్ ఫస్ట్ అనే ప్రధానిని తొలిసారి చూస్తున్నామని చెప్పారు. 2047లోగా ప్రపంచంలోనే నెంబర్‌వన్‌గా భారత్ ఉందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుతో ఉత్తరాంధ్ర కొత్త చరిత్రకు నాంది పలికిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఉత్తరాంధ్ర శక్తికి నిదర్శనం ఈ ఎయిర్‌పోర్టు. భూములిచ్చిన రైతులకు పాదాభివందనం చేస్తున్నా. ఉత్తరాంధ్ర వాసి జీఎమ్మారే ఈ ఎయిర్‌పోర్టు నిర్మించారు. తొలి అడుగు వేసిన అశోక్‌గజపతిరాజు, నిర్మాణం పూర్తిచేసే బాధ్యత తీసుకున్న రామ్మోహన్ ఇక్కడి వారే. భోగాపురం ఎయిర్‌పోర్టుకు నాడు కొబ్బరికాయ కొట్టింది మనమే.. నేడు గుమ్మడికాయ కొట్టింది మనమే. ఈ విమానాశ్రయంతో ఈ ప్రాంతం దశ, దిశ మారతాయి. ఉత్తరాంధ్రకు గూగుల్, స్టీల్ కంపెనీతో పాటు చాలా సంస్థలు వచ్చాయి. రెండేళ్ల క్రితం విధ్వంసమైన రాష్ట్రాన్ఇన చూశాం. కష్టాల్లో ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చిన వ్యక్తి మోదీ. పోలవరం, రైల్వే జోన్, విశాఖ ఉక్కును కాపాడిన వ్యక్తి మోదీ. ప్రధాని సహకారంతో ఉత్తరాంధ్రలో 189 ప్రాజెక్టులకు పెట్టుబడులు రాబోతున్నాయి. రూ.2,784 కోట్లతో 8 ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. రాజధాని అమరావతికి నిధులు ఇచ్చి అండగా నిలబడ్డారు. 2028 నాటికి అమరావతి మొదటి దశ పనులన్నీ పూర్తి చేసి ప్రధాని చేతుల మీదుగా ప్రారంభిస్తాం. ప్రధాని మోదీ .. 12 ఏళ్లుగా దేశాన్ని సమర్థంగా నడిపిస్తున్నారు. ఈ దేశాన్ని డిజిటల్ ఇండియాగా మార్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. పరిపాలనలో అవినీతి ఆరోపణలు లేకుండా ముందుకెళ్తున్నారు. రోడ్లు, రైల్వేలు, విమానాశ్రయాలు నిర్మిస్తున్నారు. సౌరశక్తి, గ్రీన్ హైడ్రోజన్ ద్వారా కాలుష్యం తగ్గిస్తున్నారు.

# ఎర్రబస్సు రాదన్న చోటకు ఎయిర్ బస్సు వచ్చింది

మొదటిపేజీ తరువాయి

ఎర్రబస్సు రాదు అన్నచోటకి ఎయిర్ బస్ వచ్చింది. ఎర్రబస్సు రాదు అన్న చోటకి ఏకంగా మన నమో వచ్చారు. ఇదీ ఉత్తరాంధ్ర దెబ్బ? అర్థమైందా రాజా..‘ అంటూ రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఉత్తేజభరితంగా ప్రసంగించారు. భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ సభలో ప్రధాని నరేంద్ర మోదీజీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో కలసి మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర కలలకు రెక్కలిచ్చిన నమోఎయిర్ పోర్టు ఆవరణలో ఏర్పాటుచేసిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహావీరుడు అల్లూరి సీతా రామరాజు గారు నడయాడిన గొప్ప నేల ఉత్తరాంధ్ర. ఈ రోజు నుంచి ఈ నేల చరిత్ర, పౌరుషం గురించి ప్రపంచం మొత్తం మాట్లాడుతుంది. ఈ రోజు కేవలం ఒక ఎయిర్ పోర్ట్ ప్రారంభం మాత్రమే కాదు. మన నమో గారి వికసిత్ భారత్, మన సీబీఎన్ గారి విజన్ కలిసిన రోజు. ఉత్తరాంధ్ర భవిష్యత్తు మారే రోజు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో దూసుకెళ్లే రోజు. ఈనేలపై స్వాతంత్ర్యం కోసం పోరాడింది అల్లూరి సీతారామ రాజు గారు అయితే ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు ఇచ్చింది మన నమో. రైతుల త్యాగం, కార్మిక కష్టం, మన సీబీఎన్ విజన్‌కు ప్రతిరూపం ఈ విమానాశ్రయం. అల్లూరి సీతా రామరాజు గారికి ఉన్న పట్టుదల, పౌరుషం, దేశ భక్తి నాకు మన నమోలో కనిపిస్తుంది. నమో అంటే ధైర్యం, నమో అంటే విశ్వాసం, నమో అంటే సురక్షిత భారత్. నమో అంటే శత్రువు గుండెల్లో భయం, అభివృద్ధి, పేదల సంక్షేమం, భవిష్యత్తుకు భరోసా కోరుకునే వారికి ఒకే ఒక సమాధానం నమో.

# అజిత్ దోవల్‌కు లోక్‌మాన్య తిలక్ జాతీయ పురస్కారం:

## అమిత్ షా చేతుల మీదుగా ప్రధానం

మొదటిపేజీ తరువాయి

ఈ వేడుకలో లోక్‌మాన్య తిలక్ స్మారక్ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ రోహిత్ తిలక్, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, డిప్యూటీ సీఎంలు ఏక్ నాథ్ షిండే, సునేత్ర పవార్‌లతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అవార్డు కింద ఒక జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో పాటు రూ. 1 లక్ష నగదు బహుమతిని అందజేశారు.దేశ భద్రత, దౌత్యం, ఇంటెలిజెన్స్ రంగాలలో సుదీర్ఘ అనుభవం ఉన్న అజిత్ దోవల్ (81) భారత రక్షణ వ్యవస్థలో కీలక పాత్ర పోషించారు. ‘ఆపరేషన్ బ్లాక్ థండర్’, డోక్లామ్ వివాదంలో వ్యూహాత్మక దౌత్య చర్చలు, బాలాకోట్ వైమానిక దాడుల రూపకల్పనలో ఆయన పాత్ర అత్యంత ప్రశంసనీయం.1968 కేరళ కేడర్‌కు చెందిన ఈ మాజీ ఐపీఎస్ అధికారి, మూడు దశాబ్దాలకు పైగా భారత ఇంటెలిజెన్స్‌లో పనిచేసి, ఆ తర్వాత ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్‌గా సేవలు అందించారు. మిజోరం, సిక్కిం, పంజాబ్, జమ్మూకశ్మీర్ వంటి తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలతో పాటు ఇస్లామాబాద్, లండన్‌లలో భారత దౌత్య కార్యాలయాల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. తమ రంగాల్లో సేవలు అందిస్తూ భారత్‌ను అత్యున్నత స్థాయిలో నిలిపిన ప్రముఖులకు ప్రతి ఏటా ఈ లోక్‌మాన్య తిలక్ జాతీయ అవార్డును ప్రధానం చేస్తున్నారు.

# ఈ20 పెట్రోల్‌పై కేజ్రీవాల్ యుద్ధం:

## ‘అధ్యయనం లేదు.. స్పష్టత లేదు’ అంటూ తీవ్ర విమర్శలు

మొదటిపేజీ తరువాయి

ఈ20 పెట్రోల్ వల్ల వాహనాల మైలేజీ ఎంత తగ్గుతుందనే దానిపై ఒక మంత్రిత్వ శాఖ 2 నుంచి 5 శాతం అని చెబితే, మరొకటి 4 శాతం అని చెబుతోందని కేజ్రీవాల్ ఎత్తిచూపారు. శాస్త్రీయమైన ఆధారాలు లేకుండా నిర్ణయాలు తీసుకోవడం వల్ల సామాన్య వాహనదారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ20 పెట్రోల్ వాడటం వల్ల వాహనాల ఇంజిన్లు వేగంగా దెబ్బతింటున్నాయని, మైలేజ్ గణనీయంగా పడిపోయి వాహనదారులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నప్పటికీ ఈ విధానాన్ని ఎందుకు నిర్బంధంగా అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. ఇందులో ప్రభుత్వానికి ఉన్న స్వార్థ ప్రయోజనాలేమిటో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రజలకు, వాహనదారుల ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తున్న ఈ20 పెట్రోల్ విధానం ఏమాత్రం శ్రేయస్కరం కాదని, తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయంపై పునరాలోచన చేసి విధానాన్ని సమీక్షించాలని కేజ్రీవాల్ కోరారు.



# క్షమాపణలు కాదు... కేసుల ఎత్తివేతపై మాట్లాడండి

మొదటిపేజీ తరువాయి

లేక విద్యార్థులపై నమోదైన కేసులను కూడా ఉపసంహరించుకుంటారా?’ అంటూ ఆయన సోషల్ మీడియా ద్వారా ప్రశ్నించారు. ఇటీవల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనల్లో, కొందరు ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వీడియోలు వైరల్ అయ్యాయి. ఈ ఘటనపై ప్రధాని స్పందిస్తూ, ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో విడుదల చేశారు. తనను, తన తల్లిని దూషించిన వారిని తాను క్షమిస్తున్నానని, వారిని శిక్షించడం కంటే సరైన మార్గంలో నడిపించడం సమాజ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. వీడియోపై స్పందించిన అభిజీత్ దిప్కే, ’క్షమించామని చెప్పడం సరిపోదు. విద్యార్థులపై నమోదైన కేసులను కూడా ఎత్తివేస్తారా?’ అని ప్రశ్నించారు. అలాగే ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఒక కెమెరామెన్‌పై అనుచిత పదజాలం ఉపయోగించిన వీడియోను ప్రస్తావిస్తూ, ’ఈ దేశంలో రెండు రకాల చట్టాలా? యువతకు ఒకటి, అధికార పార్టీకి మరొకటా?’ అని విమర్శించారు. కాగా, ప్రధానమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆరోపణలతో నోయిడాకు చెందిన ఓ బాలికపై కేసు నమోదైంది (ఏజీనిబిజీస ఓజీనిబిజీస ÷ఔసనీబిIబబి). తాజాగా ఆమె వీడియో విడుదల చేసి దేశ ప్రజలకు, ప్రధానమంత్రికి క్షమాపణలు చెప్పింది. తాను చేసిన వ్యాఖ్యలపై పశ్చాత్తాపం వ్యక్తం చేసింది. కాగా, నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన కేసుల విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై ఆసక్తి నెలకొంది.

# థింసా నృత్యం నన్ను కదిలించింది

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతూ 13 వేల మంది గిరిజన విద్యార్థినిలు, మహిళలు థింసా నృత్యం చేశారు. థింసా నృత్యంపై ప్రధాని మోదీ శనివారం మధ్యాహ్నం తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. ’13 వేల మంది చేసిన థింసా నృత్యం నన్ను కదిలించింది. ఈ అపూర్వ స్వాగతం ఏపీ ప్రజల ఆత్మీయతకు ప్రతీక. సాంస్కృతిక వారసత్వాన్ని థింసా ప్రతిబింబించింది. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవాన్ని.. థింసా నృత్యం చిరస్మరణీయంగా మార్చింది’ అని రాసుకొచ్చారు. ప్రధాని మోదీ మరో పోస్టులో ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం గురించి స్పందిస్తూ.. ’నా మిత్రుడు నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో.. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆంధప్రదేశ్ రాష్ట్రం ఎంతో ఉత్సాహంతో ముందుకు సాగుతోంది. సెమికండక్టర్లు, ఐటీ, ఇన్నోవేషన్స్ వంటి రంగాలలో రాష్ట్రం అద్భుతమైన కృషి చేస్తోంది. ఇది రాష్ట్రంలోని యువతకు ప్రత్యేక ప్రయోజనాలను చేకూరుస్తుంది’ అని రాసుకొచ్చారు.

# సంపాదకీయం

## ఉత్తరాంధ్రకు మణిహారం భోగాపురం!

పోర్టులు, ఎయిర్‌పోర్టులు, సువిశాల సముద్రతీరం కలిగి ఉండడం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కలసి వచ్చే అంశం. రోడ్లు గ్రామాలను అనుసంధానిస్తే, రైల్వేలు పరిశ్రమలను కలుపుతాయి. ఓడరేవులు దేశాల మధ్య వ్యాపారాన్ని విస్తరిస్తే, విమానాశ్రయాలు ప్రపంచ స్థాయి అవకాశాలను ముంగిట్లోకి తీసుకొస్తాయి. నేటి గ్లోబల్ ఎకానమీలో అంతర్జాతీయ స్థాయి ఏవియేషన్ రవాణా వ్యవస్థ ఉంటేనే విదేశీ పెట్టుబడులు, పర్యాటకం, పారిశ్రామిక ఎగుమతులు, రియల్ ఎస్టేట్, ఉద్యోగావకాశాలు విస్తరిస్తాయి. దీంతో అభివృద్ధి వేగంగా సాగడానికి దోహదపడుతుంది. ఎపిలో అనేక సహజ వనరులు ఉన్నప్పటికీ గతంలో నిర్లక్ష్యం చేశారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చాక అనేక రంగాల్లో అభివృద్ధి కళ్లకు కనిపిస్తోంది. ఓ వైపు భోగాపురం ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వచ్చింది. ప్రధాని మోడీ దీనిని ప్రారంభించడం ద్వారా ఉత్తరాంధ్ర కు గేట్‌వేను తెరిచారు. అమరావతలి రాజధాని నిర్మాణం కూడా శరవేగంగా సాగుతోంది. అలాగే పోలవరం పూర్తి కావస్తోంది. ఇవన్నీ నిజానికి జగన్ హచయాంలోనే పూర్తి కావాల్సిన ప్రాజక్టులు. కానీ జగన్ నిర్లక్ష్యం కారణంగా వీటిని పక్కన పెట్టారు. మనమెంతకాలం ఉంటామన్నది పక్కన పెట్టి అభివృద్ధిలో మనదైన ముద్ర వేస్తే చిరకాలం ప్రజలు గుర్తుంచుకుంటారు. దశాబ్దాలుగా విశాఖపట్నం ఉత్తరాంధ్రకు ఆర్థిక, వాణిజ్య కేంద్రంగా వర్ధిల్లుతున్నా, ప్రస్తుతం ఉన్న విశాఖ విమానాశ్రయం పూర్తిస్థాయి పౌర విమానాశ్రయం కాదు. ఇది నావల్ డాక్ వారి విమానాశ్రయం కావడంతో చంద్రబాబు భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయా నికి నిర్ణయించారు. విశాఖ పట్టణానికి ఇది దగ్గరగా ఉండడ, ఉత్తరాంధ్రకు కూడా కలసి వచ్చే అంశం. విశ్శాఖ పూర్తిస్తాయి విమానాశ్రయం కాకపోవడంతో ప్రముఖ ఎయిర్‌లైన్స్ సంస్థలు విశాఖకు తగినన్ని సర్వీసులు నడపలేక పోయాయి. విశాఖపట్నం ఐటీ, ఫార్మా, వైద్యం, విద్య పర్యాటక రంగాల్లో అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా ఎదుగుతున్న వేళ, ఒక పూర్తిస్థాయి పౌర అంతర్జాతీయ విమానాశ్రయం అవసరం ఏర్పడింది. అందుకే ఎపి విభజన తరవాత చంద్రబాబు భోగాపురం కోసం నిర్ణయించారు. 2014లో విశాఖ సమీపంలోని భోగాపురాన్ని గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయానికి అనువైన ప్రాంతంగా గుర్తించారు. 2019 ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. కేవలం విమానాశ్రయమే కాకుండా ఏరోసిటీ, విమానాల మరమ్మతులు, పైలట్ శిక్షణ కేంద్రాలతో కూడిన లాజిస్టిక్స్ హబ్‌గా దీనిని డిజైన్ చేశారు. భూసేకరణ చేపట్టి, ఇళ్లు కోల్పోయిన 390 కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీతో పాటు ప్రత్యేక కాలనీలు నిర్మించారు. అన్నింటికి మించి రామ్మోహన్ నాయుడును ఎన్‌డిఎలో పౌర విమానయాన శాఖ మంత్రిగా నియించయుకోవడం ద్వారా పనులు చకచకా చేయించుకోగలిగారు. చంద్రబాబు సిఎంగా కొనసాగివుంటే 2019లోనే ఇది పూర్తయ్యేది. దాదాపు 12 ఏళ్ల తరవాత మళ్లీ రెండోదఫా చంద్రబాబు అధికారంలోకి వచ్చాక భోగాపురం వేగం పుంజుకుని చకచకా పనులు పూర్తి చేసుంది. ఇలా చరిత్రలో 2026 ఆగస్టు 1 నూతన అధ్యాయానికి నాంది పలికింది. ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ, భోగాపురంలో నిర్మించిన 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని' ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేయడం విశేషం. సాధారణంగా విమానాశ్రయాలు రవాణా సౌకర్యాలను మెరుగుపరుస్తాయి. కానీ కొన్ని ప్రాజెక్టులు మాత్రమే ఒక ప్రాంత ఆర్థిక రూపురేఖలను పూర్తిగా మార్చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ సరిగ్గా అటువంటి ప్రాజెక్టే! మౌలిక సదుపాయాల కల్పన ఏ ప్రాంత ఆర్థికాభివృద్ధికైనా పునాది వంటిది. ఈ ఆలోచనా సరళితోనే కూటమి ప్రభుత్వం భోగాపురం విమానాశ్రయాన్ని అత్యాధునిక వసతులతో తీర్చిదిద్దింది. నిజానికి ఇది 2019లోపే పూర్తయి వుంటే పరిస్తితి మరోలా ఉండేది. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ మౌలిక వసతుల విప్లవంలో భోగాపురం ప్రాజెక్టు ఒక మచ్చుతునక! జాతీయ రహదారులు, రైల్వేలు, పోర్టులు, ఎయిర్‌పోర్టుల అనుసంధానం ద్వారా దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేసే క్రమంలో ఇది మరో చరిత్రాత్మక విజయం. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు భోగాపురం అనేది కేవలం ఒక కనెక్టివిటీ మాత్రమే కాదు. ఆత్మవిశ్వాసానికి, సరికొత్త అవకాశాలకు, ఉన్నత ఆశయాలకు సంకేతం. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్‌కు, పారిశ్రామిక ఆవిష్కరణలకు ఉత్తరాంధ్ర ఇప్పుడు చిరునామాగా నిలవనుంది. 2024లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఈ ప్రాజెక్టు మళ్లీ శరవేగంగా పట్టాలెక్కింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించగా, కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు క్షేత్రస్థాయిలో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ రాత్రింబవళ్లు పనులు జరిగేలా చర్యలు తీసుకున్నారు. సుమారు రూ.4,700 కోట్ల భారీ వ్యయంతో 2,700 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో నిర్మించిన భోగాపురం విమానాశ్రయం దేశంలోనే అత్యంత ఆధునిక గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టులలో ఒకటి. ఇక్కడ నిర్మించిన 3.8 కిలోమీటర్ల సుదీర్ఘ 'కోడ్ 4ఈ' రన్‌వే ద్వారా భారీ అంతర్జాతీయ విమానాలు కూడా సునాయాసంగా ల్యాండ్ అవుతాయి. ప్రాథమికంగా ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించేలా ఈ టెర్మినల్ రూపుదిద్దుకుంది. ప్రకృతి విపత్తులను సైతం తట్టుకునేలా అత్యున్నత ప్రమాణాలతో దీనిని నిర్మించారు. ఈ విమానాశ్రయం అందుబాటులోకి ర ఆవడంతో ఉత్తరాంధ్రలోని ఫార్మా, సీఫుడ్, పండ్లు, పూలు, వస్త్ర పరిశ్రమల ఎగుమతులకు అవకాశాలు పెరగడంతో పాటు యువతకు పెద్ద ఎత్తున ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

# కట్టప్పల తో...!

# పారాహుషార్!

## నమ్మిన వాడిని ముంచడానికి కంకణం కట్టుకున్నారా?

## రాజంపేట టిడిపిలో ఏం జరుగుతుంది?

ఏపీ బ్యూరో(ప్రజా సీమ)

ఎక్కడైనా ఎదురుగా వచ్చే శత్రువుతో పోరాడడం సులభం ఏమో కానీ పక్కనే ఉన్న శత్రువుతో పోరాడడం ఎంత కష్టమో రాజంపేట తెలుగుదేశం పార్టీ రాజకీయాలు చూస్తే స్పష్టంగా అర్థం అవుతాయి. అదేదో పెద్దలు చెప్పినట్లుగా నమ్మిన వాడినే కదా ఈజీగా మోసం చేయగలం అనే సూత్రాన్ని ఫాలో అవుతూ రాజంపేటలో తెలుగుదేశం ఎట్టి పరిస్థితుల్లోనూ బలోపేతం కాకూడదని కంకణం కట్టుకొని కట్టప్ప కట్ట కట్టుకుని నిరంతరం పనిచేస్తున్నారు. రాజంపేట టిడిపి ఇన్చార్జ్ పై కొందరు వ్యక్తులు వ్యతిరేకంగా గళం విప్పడం తో పోలిస్తే వెన్నంటే ఉంటూ వెన్నుపోటు పొడిచే నాయకుల సంఖ్య రోజుకు రోజుకు పెరుగుతుంది. ఎందుకంటే ఐదు వేళ్లు ఒక్కటిగా లేనట్లే ఏ నాయకుడు అందరికీ నచ్చాలని రూల్ లేదు. ఒకవేళ నచ్చని నాయకుడు పై విమర్శలు చేస్తే అటువంటి వారితో ఇబ్బంది ఉన్నా వారెవరో తెలుసు కాబట్టి జాగ్రత్తగా ముందుకు వెళ్ళవచ్చు. మరి వెన్నంటే ఉంటూ ఇక్కడ విషయాలను నిరంతరం అక్కడికి చేరవేస్తూ టిడిపి ఎట్టి పరిస్థితుల్లో రాజంపేటలో బలోపేతం కాకూడదని పైకి టిడిపి లోపల వైసీపీ అనేలా వ్యవహరిస్తున్న కట్టపలతో ప్రమాదం తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి.




### నారద నాయకునితో రాజంపేటలో ఇబ్బందులే!

నిరంతరం నాయకుల మధ్య చిచ్చు పెడుతూ, అమాయకులను వేధిస్తూ తమ పబ్బం గడుపుకునేందుకు పార్టీలను అడ్డుపెట్టుకొని ఒక నారద నాయకుడు చేసే హంగామా అంతా ఇంతా కాదు. ఎవరైనా అతన్ని చూస్తే అయ్యో ఇతనే అసలైన తెలుగుదేశం నాయకుడని, ఎన్టీఆర్ తర్వాత తెలుగుదేశాన్ని భుజాల మీద మోస్తున్న నాయకుడని అనుకునేలా ఆయన పర్ఫార్మెన్స్ ఉంటుంది. అయితే ఆయన కష్టపడేది పార్టీ కోసం అంటే మాత్రం పొరపాటే. నిరంతరం రాజంపేట నియోజకవర్గంలో టిడిపిలో అసంతృప్తి జ్వాలలు రగిలిస్తూ ఆ జ్వాలల్లో చలికాన్చుకునే అసలు సిసలైన నారద నాయకుని పనితీరుతో పార్టీ నాయకులు కూడా తల పట్టుకుంటున్నారు.

నాకు చాక్లెట్ ఇవ్వకపోతే అమ్మకు చెబుతా అనే పిల్లలు మాదిరిగా రాజంపేట నియోజకవర్గంలో ఎక్కడ ఏం జరిగినా అదిష్టానానికి తప్పుడు ఫిర్యాదులు ఇస్తూ పబ్బం గడుపుకోవడం ఆ నాయకుని దినచర్యంగా మారింది. మరి ఎదురుగా వచ్చే శత్రువులైన ఎదుర్కొంటే విజయం లభిస్తుందేమో కానీ నిరంతరం పక్కనే ఉంటూ ఎల్లప్పుడూ టిడిపి ఇంచార్జ్ పతనాన్ని కోరుకునే కట్టప్పలతో మాత్రం జాగ్రత్తగా లేకపోతే బాహుబలికి పట్టిన గతే గుడ్డిగా నమ్మి నాయకులకు కూడా పడుతుందని పలువురు చర్చించుకుంటున్నారు. మరి అటు కట్టప్ప గా ఇట్టా నారద మహర్షిగా గొప్పగా నాటకాన్ని రక్తి కట్టిస్తున్న ఆ వ్యక్తి ఎవరో ప్రజలే గుర్తించబోతున్నారు.

# అట్టహాసంగా రైస్ మిల్ ఔట్లెట్ స్టోర్ ప్రారంభం

**- హాజరైన రాష్ట్ర తెదేపా కార్య నిర్వాహక కార్యదర్శి ఎస్.ఎం ఫర్వీన్ తాజ్**

బి.కొత్తకోట (ప్రజా సీమ) :

తంబళ్లపల్లి నియోజకవర్గం,బి.కొత్తకోట మండలం,కనికలతోపు వెంకటేశ్వర రైస్ మిల్ నందు ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైస్ మిల్ ఔట్లెట్ స్టోర్ ను రాష్ట్ర తెదేపా కార్య నిర్వాహక కార్యదర్శి ఎస్.ఎం పర్వీన్ తాజ్ శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక తహసిల్దార్ బావాజాన్,పర్వీన్ తాజ్ లు మాట్లాడుతూ రాష్ట్ర కూటమి ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి పేద,మధ్య తరగతి కుటుంబీకులకు తక్కువ ధరకే సన్నబియ్యం అందుబాటులో తేవాలని రాష్ట్రవ్యాప్తంగా 115 రైతు బజార్లు,500 రైస్ మిల్లర్ల అవుట్ లెట్ స్టోర్ల ద్వారా స్టీమ్ రైస్ కిలో రూ.52కు,రా రైస్ రూ.50కు అందించాలని పేర్కొన్నారు.ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.గత ప్రభుత్వం లాగా మాటల ప్రభుత్వం కాదని,కూటమి చేతల ప్రభుత్వమన్నారు.ఈ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చి ప్రజలకు,ముఖ్యంగా రైతులకు అండగా నిలిచిందన్నారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ దేరంగుల నారాయణ,మండల పార్టీ ప్రెసిడెంట్ నారాయణ స్వామి రెడ్డి,అసోసియేషన్ నాయకుడు గోపాల్ రెడ్డి,మాజీ సింగల్ విండో వైస్ ప్రెసిడెంట్ ఆనంద రెడ్డి,యువ నాయకుడు పట్టా చంద్రమోహన్ రెడ్డి,శోభారాణి,మోహన్,రసూల్,సిద్దేశ్వర్ రెడ్డి,సిఎస్ డిటి సుబ్బయ్యలు పాల్గొన్నారు.




# పింఛన్ల పంపిణీ ద్వారా ప్రజలతో అనుబంధం పెరగాలి: ఎమ్మెల్యే బొలిశెట్టి

**- ప్రతి నెల ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారుల సమస్యలు తెలుసుకోవాలి**

(ప్రజా సీమ) :

సామాజిక పింఛన్లను ఇంటింటికి వెళ్లి అందజేయడం ద్వారా ప్రజలతో అనుబంధం పెంచుకోవాలని, ప్రభుత్వ అధికారులకు,కూటమి నాయకులకు శాసనసభ్యులు,రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ.4,000 సామాజిక పింఛన్లను ప్రతి నెల 1వ తేదీన నేరుగా ఇంటికే వెళ్లి అందజేస్తోందని అన్నారు.స్థానిక 4వ వార్డు అమ్మ కల్యాణ మండపం వద్ద శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంటి వద్దకే పెన్షన్ అందించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. ప్రభుత్వ సిబ్బందితో పాటు కూటమి కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి పెన్షన్‌లు, ఇతర సంక్షేమ సేవలు అందిస్తున్నారని అన్నారు.ప్రతి నెల లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లడం ద్వారా వారి సమస్యలు, కష్టసుఖాలు తెలుసుకుని



అవసరమైన సహాయం చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా నిత్యం ప్రజలతో సంబంధాలు కొనసాగించడం వల్ల కుటుంబాలతో ఆత్మీయ అనుబంధం ఏర్పడుతుందని అన్నారు.ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు. దేశంలో రూ.4,000 సామాజిక పెన్షన్ అందిస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల ఆకాంక్షలను అనుగుణంగా కూటమి పాలన

- తెలుగుదేశం నాయకులు నాగూర్ వలి హర్షం

- 14వ వార్డులో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

మదనపల్లె (ప్రజా సీమ)



: ఏపీలోని కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తోందని టిడిపి నేత,ఆర్టీసీ 1,2 డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు నాగూర్ వలి (షో ఆప్ శీనా) హర్షం వ్యక్తం చేశారు.ఎమ్మెల్యే షాజహాన్ బాషా సూచనల మేరకు శనివారం 14వ వార్డు పరిధిలోని లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను సచివాలయ సిబ్బందితో కలిసి ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నాగూర్ వలి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలతో అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతోందన్నారు.ఎన్టీఆర్ భరోసాతో అవ్వ తాతలు,వికలాంగులు,ఒంటరి మహిళలు,దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు,అన్నదాత సుఖీభవతో రైతులకు,స్త్రీ శక్తితో మహిళలకు,తల్లికి వందనంతో విద్యార్థులకు,ఎన్టీఆర్ గృహకల్పతో మధ్యతరగతి వారికి,అన్న క్యాంటీన్లతో నిరుపేదలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వెల్లడించారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను సకాలంలో అమలు చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నామన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో ఏపీ,ఎమ్మెల్యే షాజహాన్ బాషా సారథ్యంలో మదనపల్లి నియోజకవర్గం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని కొనియాడారు.కూటమి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# గొల్లప్రోలులో పింఛన్ల పంపిణీ పరిశీలన

లబ్ధిదారులతో మాట్లాడిన డీఆర్‌డీఏ పీడీ, కమిషనర్ --

బెడ్‌రిడెన్ బాధితుడికి రూ.15 వేల పింఛన్ అందజేత.

కాకినాడ జిల్లా (ప్రజా సీమ )

గొల్లప్రోలు పట్టణంలో శనివారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కాకినాడ డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ జి. శ్రీనివాస్, గొల్లప్రోలు మున్సిపల్ కమిషనర్ దివిజా సంపతి పరిశీలించారు. ఐదో సచివాలయ పరిధిలోని 13వ వార్డులో పర్యటించిన అధికారులు పింఛనుదారులతో మాట్లాడి, ఇంటి వద్దకే సచివాలయ సిబ్బంది పింఛన్లు సక్రమంగా అందజేస్తున్నారా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు.పింఛన్ల పంపిణీ విధానంపై అధికారులు ఆరా తీయగా, సచివాలయ సిబ్బంది సేవలపై లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మంచానికే పరిమితమైన (బెడ్‌రిడెన్) లబ్ధిదారు అడబాల సత్తిబాబుకు రూ.15,000 పింఛన్‌ను అధికారులు స్వయంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో ఐదో వార్డు సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ వూటా స్వామి, డీఆర్‌డీఏ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.





# ఆధ్యాత్మిక వాతావరణంలో గౌసేపాక్ జెండా ఆవిష్కరణ

- హిందూ-ముస్లిం సోదరభావానికి ప్రతీకగా వేడుకలు

గుర్రంకొండ (ప్రజా సీమ) :

పీలేరు నియోజకవర్గం,గుర్రంకొండ మండలం గాలివీడు రోడ్డు సమీపంలోని షంషేర్ ఖాన్ దర్గాలో శనివారం గౌసేపాక్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.మత పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేని ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ వేడుకల్లో మైనార్టీ సోదరులతో పాటు హిందూ భక్తులు కూడా పెద్దసంఖ్యలో పాల్గొని మత సామరస్యాన్ని చాటారు.ఈ కార్యక్రమం అనంతరం సుమారు 250 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ముత్తువల్లి గౌస్ బాషా మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా కొత్తపల్లి,గుర్రంకొండ తదితర ప్రాంతాల ప్రజలు పాల్గొనడం ఆనందదాయకమన్నారు.నేటి నుంచి షంషేర్ ఖాన్ దర్గా అభివృద్ధికి కృషి చేస్తానని,దర్గాకు సంబంధించిన ఆస్తుల పరిరక్షణతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని తెలిపారు.ఈ కార్యక్రమంలో కలిచర్ల చాంద్ భాషా,ఖాదరి,అజ్మత్ పీర్,మహబూబ్ భాషా తదితరులు పాల్గొన్నారు.





# పండుగ వాతావరణంలో ఎన్.తులసిరెడ్డి పుట్టినరోజు వేడుకలు

- శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ నేత ఎస్.రెడ్డీ సాహెబ్

మదనపల్లె (ప్రజా సీమ) :

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మాజీ రాజ్యసభ సభ్యులు,ఉమ్మడి కడప జిల్లా పరిషత్ మాజీ చైర్మన్,రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్ ఎన్.తులసి రెడ్డి సేవలు అమోఘమని కాంగ్రెస్ పార్టీ మదనపల్లె సీనియర్ నాయకులు ఎస్.రెడ్డీ సాహెబ్ కొనియాడారు.శనివారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మీడియా సెల్ చైర్మన్ డాక్టర్ ఎన్.తులసి రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా కడప జిల్లా,వేంపల్లిలోని తులసిరెడ్డి స్వగృహంలో మదనపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.రెడ్డీ సాహెబ్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలియజేశారు.రెడ్డీ సాహెబ్ తోపాటు ఎపిసిసి జనరల్ సెక్రటరీ,మాజీ అన్నమయ్య జిల్లా డిసిసి అధ్యక్షులు ఎస్.అల్లాబకష్,రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు ఎస్.మహబూబ్ బాషా,అన్నమయ్య జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి నిమ్మనపల్లె పి.ముబారక్ ఖాన్,యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బిశరత్ కుమార్ రెడ్డి,మదనపల్లె టౌన్ మాజీ సెక్రటరీ మహమ్మద్ అలి,పీలేరుకు చెందిన మండల మైనారిటీ నాయకులు ఇర్ఫాన్,డిసిసి మాజీ సెక్రటరీ పీలేరు యూసఫ్ అలిలు హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎస్.రెడ్డీ సాహెబ్ మాట్లాడుతూ డాక్టర్ ఎన్.తులసి రెడ్డి మాజీ రాజ్యసభ సభ్యునిగా,మాజీ ఎమ్మెల్సీ, 20 సూత్రాల అమలు కమిటీ మాజీ ఛైర్మన్,కడప జిల్లా పరిషత్ మాజీ చైర్మన్,కాంగ్రెస్ పార్టీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడుగా,ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) మీడియా సెల్ చైర్మనుగా పనిచేస్తున్నారన్నారు.కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో తిరిగి పుంజు కొవడంలో తులసిరెడ్డి పాత్ర అమోఘమన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఆయన చేదోడువాదోడుగా నిలుస్తున్నారని ప్రశంసించారు.భగవంతుని ఆశీస్సులతో తులసిరెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యలు, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఏలేరు నీటి పంపిణీకి కట్టుదిట్టమైన వంతుల విధానం

ఆగస్టు 15లోగా పంటల బీమా నమోదు పూర్తి చేయాలి

అధికారులకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశాలు

కాకినాడ జిల్లా (ప్రజా సీమ )

ఏలేరు ఆయకట్టు కింద సాగునీటి పంపిణీని వంతుల వారీ విధానంలో కచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎస్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. రైతులందరూ ఆగస్టు 15లోగా పంటల బీమా నమోదు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు.శనివారం కాకినాడ కలెక్టరేట్ నుంచి రెవెన్యూ, వ్యవసాయం, ఇరిగేషన్ శాఖల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్, క్షేత్రస్థాయి అధికారులతో పలు కీలక అంశాలపై సమీక్షించారు.ఏలేరు ఆయకట్టు పరిధిలో సాగునీటి పంపిణీ వంతుల వారీ విధానాన్ని కట్టుదిట్టంగా అమలు చేయడంతో పాటు అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే నీటి ఎద్దడి పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించాలని, నీటి వినియోగంలో మితవ్యయం పాటించేలా చైతన్యం తీసుకురావాలని సూచించారు.అలాగే, పంటల బీమా నమోదును ప్రత్యేకంగా పర్యవేక్షించి, అర్హులైన ప్రతి రైతు ఆగస్టు 15లోగా తప్పనిసరిగా నమోదు చేసుకునేలా గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.



# మైనార్టీల హక్కులను కాపాడడమే ముస్లిం ఐక్యవేదిక లక్ష్యం

- ఈనెల 16న బంగారుపాళ్యంలో భారీ బహిరంగ సభ

- ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర గౌరవ సలహాదారు డాక్టర్ ఎస్.కే.బాషా

మదనపల్లె (ప్రజా సీమ) :

మైనార్టీల హక్కుల పరిరక్షణే ముస్లిం ఐక్యవేదిక ప్రధాన లక్ష్యమని రాష్ట్ర గౌరవ సలహాదారు డాక్టర్ ఎస్.కే బాషా స్పష్టం చేశారు.శనివారం మదనపల్లి పట్టణంలోని ముస్లిం ఐక్యవేదిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పీలేరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సయ్యద్ సమీరుద్దీన్ తో కలిసి ఆయన పాల్గొన్నారు.ముందుగా కె.మొహిద్దీన్ షరీఫ్,సయ్యద్ అజీజ్,షేక్ సాహెబ్ పీర్,దస్తగిరి,బావాజాన్ తదితరులను కండువాలు కప్పి ముస్లిం ఐక్యవేదికలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.కే బాషా మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల అభ్యున్నతి,వారి హక్కుల సాధన కోసం ముస్లిం ఐక్యవేదిక చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.రాష్ట్ర అధ్యక్షులు జాఫర్ పులితో కలిసి ఐక్యవేదికను మరింత బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు .ముఖ్యంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతాల మధ్య చిచ్చురేపుతోందని,వారి వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.అదేవిధంగా ఈనెల 16వ తేదీ చిత్తూరు జిల్లా,బంగారుపాళ్యం నందు ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామని,రాష్ట్రం నలుమూలల నుండి ముస్లిం సోదరులు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.అనంతరం పీలేరు ప్రధాన కార్యదర్శి సయ్యద్ సమీరుద్దీన్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ముస్లింలపై దాడులు,అఘాయిత్యాలు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం వాటిని అరికట్టడంలో విఫలవ్వైందన్నారు. ముస్లింల అభ్యున్నతి,హక్కుల పరిరక్షణకు ముస్లిం ఐక్యవేదిక చక్కని వేదిక అన్నారు.నూతనంగా చేరిన సభ్యులు ఐక్యవేదిక బలోపేతానికి నిర్విరామ కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నాసిర్ బాషా,టౌన్ ప్రెసిడెంట్ బావాజీ,అజ్మత్ తదితరులు పాల్గొన్నారు.




# రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం ఇంటింటికీ





ప్రజల్లో విశ్వాసం మరింత బలపడుతోంది

టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు

సుండుపల్లి(ప్రజా సీమ)

తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమం సుండుపల్లి మండలం ముడుంపాడు గ్రామపంచాయతీ పరిధిలోని ముడుంపాడు, కందులవారిపల్లి, శివరామపురం గ్రామాల్లో ఘనంగా నిర్వహించబడింది.ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు, రాష్ట్ర టీడీపీ నాయకులు చప్పిడి మహేష్ నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు చప్పిడి రమేష్ నాయుడు లు స్థానిక దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాంచన రెడ్డయ్య, కాంచన రెడ్డి శేఖర్ ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులు, గుణశేఖర్ కుటుంబ సభ్యులు మంగళహారతులతో ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు.అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక కరపత్రాలను పంపిణీ చేస్తూ, గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం ప్రజల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రజల నుంచి విశేష స్పందన లభించగా, కూటమి ప్రభుత్వ పాలనపై పూర్తి సంతృప్తి వ్యక్తమైంది.ఈ సందర్భంగా సుగవాసి ప్రసాద్ బాబు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశగా వేగంగా అడుగులు వేస్తోందని అన్నారు. నారా లోకేష్ యువ నాయకత్వం పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేస్తోందని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజాసేవా దృక్పథం కూటమి ప్రభుత్వానికి మరింత బలాన్ని చేకూరుస్తోందని పేర్కొన్నారు.ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం ప్రతి ఇంటికి సంక్షేమాన్ని, ప్రతి ప్రాంతానికి అభివృద్ధిని చేరవేస్తోందని, గత రెండేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి, పారదర్శక పాలన, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, మౌలిక వసతుల కల్పనలో విశేష పురోగతి సాధించిందని తెలిపారు. ఇదే నమ్మకంతో ప్రజలు కూటమి ప్రభుత్వానికి మరింత మద్దతు ఇస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజమ్మ,గుట్టబాబు, మంత్రి శివారెడ్డి, రాజు, రెడ్డి రాణి, రామ శ్రీనివాసులు, రామచంద్ర, రామకృష్ణ రాజు, ఆనంద్ నాయక్, సుబ్బరామ, చిన్నసిద్ధు, దొరస్వామి నాయుడు, శ్రీను, మండల టీడీపీ నాయకులు, జనసేన నాయకులు, బీజేపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, గ్రామ పెద్దలు మరియు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు."ఇంటింటికీ తెలుగుదేశం -- ప్రతి కుటుంబానికి అభివృద్ధి, ప్రతి పేదింటికి సంక్షేమం" అనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు సుగవాసి ప్రసాద్ బాబు గారు పిలుపునిచ్చారు.

ప్రజాసీమ

# దాతల సాయం కోసం విద్యార్థిని ఎదురుచూపు





### రెండు కిడ్నీలు దెబ్బతినడంతో డయాలసిస్‌పై జీవనం..

### ఆర్థిక సాయం కోసం వేడుకోలు

**రాజంపేట (ప్రజా సీమ):**

ఉన్నత చదువులు చదివి కుటుంబాన్ని పేదరికం నుంచి గట్టెక్కించాలని కలలు కన్న ఓ విద్యార్థిని ప్రస్తుతం ప్రాణాలను కాపాడుకోవడానికి దాతల సాయం కోసం ఎదురు చూస్తోంది. రాజంపేట పట్టణంలోని రాంనగర్‌కు చెందిన పదాల పల్లవి (17), ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది.నాలుగు నెలల క్రితం ఒక రాత్రి ఇంట్లో ఉన్న సమయంలో పల్లవి అకస్మాత్తుగా కళ్లు తిరిగి మంచం మీద నుంచి కిందపడిపోయింది. దీంతో ఆమె తల్లిదండ్రులు వెంటనే రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు.తర్వాత తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా, పరీక్షలు నిర్వహించిన వైద్యులు పల్లవికి రెండు కిడ్నీలు పూర్తిగా దెబ్బతిన్నాయని నిర్ధారించారు. అప్పటి నుంచి ఆమె ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తూ ప్రస్తుతం డయాలసిస్‌పై జీవనం కొనసాగిస్తోంది. మంచానికే పరిమితమైన పల్లవికి మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన ఆర్థిక స్థోమత లేక తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.కూతురి ప్రాణాలను కాపాడేందుకు దాతలు, సేవా సంస్థలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందించాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**దాతలు సాయం కోసం..**

దాతల సహాయంపైనే పల్లవి తల్లిదండ్రులు తమ బిడ్డ భవిష్యత్తుపై ఆశలు పెట్టుకున్నారు. తమ కిడ్నీలు ఇచ్చి బిడ్డను బతికించుకుందామను కున్నా తల్లిదండ్రులు ఇద్దరు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు. ఎవరైనా ఒక కిడ్నీ దానం చేయాలని, కిడ్నీ మార్పిడికి దాతలు ఆర్థిక సహాయం చేయాలని వారు విన్నవించుకుంటున్నారు. ప్రభుత్వం కూడా చేయూతనివ్వాలని వారు కోరుతున్నారు. ఎవరైనా దాతలు ఆర్థికంగా సహాయం చేయాలనుకుంటే తమ కుమారుడు గోవర్ధన్ పేరు వచ్చే 7675042141 ఫోన్ పే నంబర్కు సంప్రదించి సాయం చేయవచ్చని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# వంతుల వారీ సాగునీటి పంపిణీని కచ్చితంగా అమలు చేయాలి

### ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం..

### పంటల బీమా నమోదు తప్పనిసరి

### గొల్లప్రోలు సమన్వయ కమిటీ సమావేశంలో అధికారుల స్పష్టీకరణ

**గొల్లప్రోలు, ఆగస్టు 1 (ప్రజా సీమ):**

ఖరీఫ్-2026 సీజన్‌లో ప్రతి రైతుకు సాగునీరు అందేలా వంతుల వారీ విధానాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని అధికారులు స్పష్టం చేశారు. గొల్లప్రోలు తహసీల్దార్ కార్యాలయంలో శనివారం రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు, డీసీ సభ్యులతో కలిసి సాగునీటి నిర్వహణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు.తహసీల్దార్ డి.వి. భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నీటి భద్రత చర్యలు, అంచలవారీ రిక్కీ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. మండలంలోని మెరక భూముల్లో పెసర, మినుము, మొక్కజొన్న వంటి ఆరుతడి పంటలను ప్రోత్సహిస్తున్నామని, రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. పంటల బీమా నమోదు ప్రాధాన్యాన్ని వివరించిన ఆయన, తక్కువ వ్యవధిలో కోతకు వచ్చే వరి వంగడాలనే సాగు చేయాలని రైతులకు సూచించారు.మండల ఇరిగేషన్ అధికారి ఇ. పద్మజ మాట్లాడుతూ సాగునీటిని వృథా చేయకుండా వంతుల వారీ విధానంలో వినియోగిస్తే ఆయకట్టు మొత్తం రైతులకు



సమానంగా నీరు అందుతుందని వివరించారు. నీటి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు రైతులతో సమన్వయం చేసుకుని నీటి పంపిణీని పర్యవేక్షించాలని సూచించారు.
సమావేశంలో గొల్లప్రోలు నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు డి.వి. కొండలరావు, ఏలేరు ప్రాజెక్టు వైస్ ప్రెసిడెంట్ ఊట నానిబాబు, మల్లవరం కేవీ భాస్కర్ రెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారులు సంధ్య, శైలజ, గ్రామ రెవెన్యూ అధికారులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

# బీసీ వసతి గృహం తరలింపు నిర్ణయాన్ని మానుకోవాలి

### - బీవైఎస్ రాష్ట్ర అధ్యక్షులు పునీత్ కుమార్ డిమాండ్

**మదనపల్లె (ప్రజా సీమ)**

అన్నమయ్య జిల్లాలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న బీసీ హాస్టళ్ల పునర్వ్యవస్థీకరణలో భాగంగా మదనపల్లె బీసీ హాస్టల్‌ను రాయచోటికి తరలించే ప్రతిపాదనను వెంటనే విరమించాలని బహుజన యువసేన (బీవైఎస్) రాష్ట్ర అధ్యక్షులు జి.పునీత్ కుమార్ డిమాండ్ చేశారు.ఈ మేరకు శనివారం జిల్లా బీసీ సంక్షేమ అధికారి అందుబాటులో లేకపోవడంతో జిల్లా బీసీ సంక్షేమ కార్యాలయ సూపరింటెండెంట్ ధీరజ్ కి వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా పునీత్ కుమార్ మాట్లాడుతూ మదనపల్లె జిల్లా ప్రధాన కేంద్రం కావడంతోపాటు చుట్టుపక్కల అనేక మండలాల నుండి వందలాది మంది పేద బీసీ విద్యార్థులు ఉన్నత విద్య కోసం మదనపల్లెకు వస్తున్నారని తెలిపారు. హాస్టల్‌ను రాయచోటికి తరలిస్తే విద్యార్థులపై అదనపు ఆర్థిక భారం పడటమే కాకుండా పలువురు విద్యార్థులు చదువును మధ్యలోనే నిలిపివేసే పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల మదనపల్లె బీసీ హాస్టల్‌ను యథాతథంగా కొనసాగిస్తూ,రాష్ట్ర ప్రభుత్వానికి సానుకూల సిఫారసు చేయాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖను కోరినట్లు తెలిపారు.బీసీ విద్యార్థుల విద్యా భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని గౌరవించి మదనపల్లె హాస్టల్‌ను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.



# కిర్లంపూడిలో ముద్రగడకు ఘన నివాళి





### -గొల్లప్రోలు నుంచి భారీగా తరలిన వైఎస్సార్సీపీ శ్రేణులు

**కాకినాడ జిల్లా (ప్రజా సీమ )**

గొల్లప్రోలుస్వర్గీయ ముద్రగడ పద్మనాభం సంతాప సభకు గొల్లప్రోలు నుంచి వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్‌చార్జి వంగా గీత ఆధ్వర్యంలో కిర్లంపూడిలో నిర్వహించిన సంతాప సభలో పాల్గొన్న వారు ముద్రగడ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా ఆయన ప్రజాసేవలను, సామాజిక ఉద్యమాల్లో పోషించిన పాత్రను నాయకులు స్మరించుకున్నారు. ముద్రగడ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు జ్యోతుల భీముడు, గొల్లప్రోలు పట్టణ అధ్యక్షుడు మైనం రాజా, మాజీ చైర్‌పర్సన్ గండేటి రాము, రామిశెట్టి సత్తిబాబు, మొగులి దొరబాబు పాల్గొన్నారు. అలాగే పార్టీ వివిధ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ఆలయపునః నిర్మాణ పనులు మరింత వేగవంతం

**(ప్రజా సీమ) :**

నిత్య కళ్యాణం పచ్చతోరణం గా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరేశ్వర స్వామి వారి ఆలయ పునః నిర్మాణ పనులు మరింతలిసిందే ఎప్పటికప్పుడు నిర్మాణ పనులు ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం అధికారులు ఆలయ పునః నిర్మాణ పనులు పరిశీలించారు.ఎస్ ఈ దుర్గేష్ కుమార్ఈ ఈ శ్రీనివాస్,డి ఈ ఉదయ్ కుమార్డిప్యూటీ స్థపతి సతీష్ లు ఆలయ చైర్మన్ దాం, నంది మండపం పనులకు సంబంధించి చిత్ర వనం పనులు పూర్తయ్యాయి అధిష్టాన పీఠం పనులకు మార్కింగ్ చేశారు.నిర్ణీత సమయానికి పనులు పూర్తయ్యేలా పారదర్శకం జరుగుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు.



# క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఆదిత్య విద్యార్థుల అద్భుత ప్రతిభ

### - లారే కన్సల్టింగ్ సంస్థలో ఉద్యోగాలకు 25 మంది ఎంపిక

### - కళాశాల యాజమాన్యం హర్షం

**మదనపల్లె (ప్రజా సీమ) :**

పుంగనూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు మరోసారి క్యాంపస్ నియామకాలలో సత్తా చాటారు.ప్రముఖ లారే కన్సల్టింగ్ అండ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ నియామక ప్రక్రియలో కళాశాలకు చెందిన 25 మంది విద్యార్థులు ఎంపికయ్యారు.ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి రూ.3.6 లక్షల వేతన ప్యాకేజీతో ఉద్యోగ అవకాశాలు లభించాయి.ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం ఎంపికైన విద్యార్థులను అభినందించింది.కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తల్లిదండ్రులకు మరియు కళాశాలకు గుర్తింపు తీసుకురావాలని వివరించారు.కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల కృషితోపాటు వారికి శిక్షణ అందించిన డీన్లు,విభాగాధిపతులు,అధ్యాపకులు మరియు ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ బృందం సమిష్టి కృషి వల్ల ఈ విజయం సాధ్యమైందని తెలిపారు.ఈ విజయానికి తోడ్పడిన ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం సభ్యులు డాక్టర్ డి.శ్రీనివాసులు రెడ్డి,డాక్టర్ కిరణ్ కుమార్,సి.మనోజ్ కుమార్ తోపాటు అన్ని విభాగాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ కో-ఆర్డినేటర్లను కళాశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది.




# 20వ వార్డులో అట్టహాసంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

### - హాజరైన టిడిపి రాష్ట్ర కార్యదర్శి పచ్చిపాల తులసి రామకృష్ణ

**మదనపల్లె (ప్రజా సీమ)**

: పట్టణంలోని 20 వార్డులో శనివారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి పచ్చిపాల తులసి రామకృష్ణ హాజరయ్యారు.ఇందులో భాగంగా వార్డు పరిధిలోని లబ్ధిదారులకు పెన్షన్ నగదును ఆమె పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పచ్చిపాల తులసి రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సరిగ్గా లేకపోయినప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను సకాలంలో అమలు చేస్తూ ప్రజల జీవితాల్లో కూటమి ప్రభుత్వం వెలుగులు నింపుతోందన్నారు.పెన్షన్లు అవ్వతాతలు,ఒంటరి మహిళలు,ప్రత్యేక ప్రతిభావంతులు,దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు భరోసా కల్పిస్తున్నాయన్నారు.అనంతరం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలను వివరించారు.అదేవిధంగా ప్రజాసమస్యలను తెలుసుకొని ఆ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు,కార్యకర్తలు వార్డ్ మెంబర్స్ పాల్గొన్నారు.



# మిట్స్ యూనివర్శిటీతో కాంగో డి.ఎ.ఎస్.టి ఎంఓయు

### - యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్ వెల్లడి

**మదనపల్లె (ప్రజా సీమ) :**

మదనపల్లె సమీపంలోని మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (మిట్స్) డీమ్డ్ టు బి యూనివర్సిటీ ఆఫ్రికా దేశం కాంగో రిపబ్లిక్ కి చెందిన డేనియల్ అకాడమీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డి.ఎ.ఎస్.టి)తో అంతర్జాతీయ విద్యా సహకారాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ ఒప్పందం ద్వారా బోధన మరియు విద్యా పరమైన మార్గదర్శకత్వం,ఫలితాల ఆధారిత సిలబస్ తయారీ,కోర్సు మెటీరియల్ అభివృద్ధి,అధ్యాపకులకు శిక్షణ మరియు మార్గదర్శకత్వం వంటి విద్యాసేవలను మిట్స్ అందిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా డేనియల్ అకాడమీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రతినిధులు మీవెల్ అర్జునన్ మరియు విగ్నేష్ అర్జునన్ మిట్స్ క్యాంపస్‌ను సందర్శించి,అకడమిక్ ప్రణాళిక,కరికులం రూపకల్పన,సిలబస్ తయారీ,అధ్యాపకుల మెంటరింగ్,విద్యా నాణ్యత మెరుగుదల వంటి అంశాలపై చర్చించారు.అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అవుట్‌కమ్ బేస్డ్ కరికులం,ఫలితాల ఆధారిత సిలబస్ రూపకల్పన,నాణ్యమైన కోర్సు మెటీరియల్ అభివృద్ధితోపాటు అకడమిక్ మెంటరింగ్ సేవలను అందించనున్నారు.ఈ ఒప్పంద పత్రాలపై విభాగాధిపతి డాక్టర్ ఎం.శ్రీదేవి మరియు డేనియల్ అకాడమీ ప్రతినిధులు మీవెల్ అర్జునన్,విగ్నేష్ అర్జునన్ సంతకాలు చేశారు.ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్,ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్,అడ్వైజర్ (ఆర్ అండ్ డి) డాక్టర్ తులసీరామ్ నాయుడు,డీన్-స్కూల్ అఫ్ కంప్యూటింగ్ డాక్టర్ చంద్ర ప్రకాష్ గుప్తా,విభాగాధిపతి డాక్టర్ ఎం.శ్రీదేవి,డాక్టర్ ఆర్.నిధ్య మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.




# సంక్షేమానికే పెద్దపీట కూటమి ప్రభుత్వ లక్ష్యం.ఎం ఏ షరీఫ్.కోప్పాడ రవి

**నర్సాపురం ఆగస్టు1 (ప్రజా సీమ) :**

నర్సాపురంలో ఇంటింటికి తెలుగుదేశంకుటుంబానికి అండగా నిలిచే సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడమే ప్రభుత్వ లక్ష్యమని మాజీ శాసనమండలి చైర్మన్ ఎంఏ షరీఫ్ అన్నారు. నరసాపురం పట్టణంలోని పలు వార్డులలో శనివారం ఇంటింటికి తెలుగుదేశం సూపర్ సిక్స్ పథకాలు అమలు అందుతున్నాకి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు పారదర్శకంగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్ రవి తెలిపారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, అర్హత ఉన్న ఎవరూ ప్రభుత్వ సహాయానికి దూరం కాకుండా చూస్తామని రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నిడదవోలు అబ్జర్వర్ కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్ రవి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ నర్సాపురం తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు జక్కం శ్రీమన్నారాయణ ముస్లిం మైనారిటీ నాయకులు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాసీమ

## ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని కలిసిన వైఎస్సార్సీపీ నేతలు

**మదనపల్లె (ప్రజా సీమ) :**

తిరుపతి నగరంలో శనివారం రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని మదనపల్లి నియోజకవర్గానికి చెందిన వైఎస్ఆర్సిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. విద్యార్థి విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి హేమంత్ కుమార్,అన్నమయ్య జిల్లా సెక్రెటరీ,వలసపల్లి యువ నాయకులు జి.నాగరాజరెడ్డి,కొత్తవారిపల్లి మాజీ సర్పంచ్ మహేష్ బాబు,ఆనంద్ రెడ్డిలు ఎంపీని కలిసిన వారిలో ఉన్నారు. నియోజకవర్గంలో వైకాపా బలోపేతానికి,స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషిచేయాలని సూచించారు. అదేవిధంగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను ప్రజలకు ఎప్పటికప్పుడు వివరించాలన్నారు. వైకాపా సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ ఆదేశాలను పాటిస్తూ అందరూ సమిష్టిగా ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి సమర్ధవంతమైన నేత అని,వర్తమాన రాజకీయాల్లో అత్యంత ప్రజాదరణ కలిగిన రాజకీయ నాయకుడని కొనియాడారు. ఎంపీ సూచనల,సలహాల మేరకు నడుచుకొని పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తామని వారు స్పష్టం చేశారు.



## డొక్కా సీతమ్మ అన్న సదుపాయ కేంద్రం సేవలు 208వ వారానికి చేరిక

**పిఠాపురం:(ప్రజా సీమ )**

నిరుపేదల ఆకలి తీర్చడమే పరమావధిగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ అన్న సదుపాయ కేంద్రం విజయవంతంగా 208వ వారానికి చేరుకుంది. మహాదాత శ్రీమతి డొక్కా సీతమ్మ గారి సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని, జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారి ఆశయాల మేరకు ఈ అన్నదాన కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతోంది. స్థానిక పిఠాపురం పశువుల సంత ప్రాంగణంలో ప్రతి శనివారం నిర్వహించే ఈ సేవా కార్యక్రమాన్ని జనసేన పార్టీ గొల్లప్రోలు మండల అధ్యక్షులు శ్రీ జ్యోతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంతకు వచ్చిన వందలాది మంది నిరుపేదలకు, కార్మికులకు ప్రేమతో అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు జ్యోతుల శ్రీనివాస్ మాట్లాడుతూ, "ఆకలితో ఉన్న వారి కడుపు నింపడమే అత్యున్నత సేవ" అనే పవన్ కళ్యాణ్ గారి పిలుపుతో ఈ కేంద్రాన్ని విజయవంతంగా నడుపుతున్నామని తెలిపారు. మానవత్వమే మహోన్నతమని చాటుతూ, ప్రజాసేవే లక్ష్యంగా జనసేన పార్టీ నిరంతరం ప్రజల చెంత ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.





## పేదరిక నిర్మూలనకే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు.

### .కాట్రేనికోన ఎంపీడీఓ బి.రాజేశ్వర్ రావు

**కాట్రేనికొన, ఆగస్టు 01 (ప్రజా సీమ ):**

కాట్రేనికోన మండల పరిధిలోని నడవపల్లి గ్రామ పంచాయతీ, పల్లిపాలెం గ్రామాల్లో శనివారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం అత్యంత పారదర్శకంగా జరిగింది. మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) బి. రాజేశ్వర్ రావు నేతృత్వంలో లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి అధికారులు ఈ సామాజిక పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రాజేశ్వర్ రావు మాట్లాడుతూ, సమాజంలోని నిరుపేదలు, వృద్ధులు, వికలాంగులు మరియు ఒంటరి మహిళల సామాజిక-ఆర్థిక వికాసానికి, వారి ఆత్మగౌరవ రక్షణకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం ఎంతో దోహదపడుతోందని కొనియాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు సకాలంలో అందజేయడమే లక్ష్యంగా గ్రామ సిబ్బంది పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ ఎన్. శంకర్ నారాయణ, పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర, స్వర్ణ, సచివాలయ ఉద్యోగులు మరియు గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.



# లంపిస్కిన్ వ్యాధి నివారణకు నేటి నుండి టీకాలు

### - పశుసంవర్థక శాఖ ఏడి రోహిణి వెల్లడి

**మదనపల్లె (ప్రజా సీమ)**



అన్నమయ్య జిల్లా,మదనపల్లి నియోజకవర్గ పరిధిలో నేటి (ఆదివారం) నుండి పాడిపశువులకు లంపిస్కిన్ (ముద్ద చర్మవ్యాధి) సోకకుండా నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పశు సంవర్ధక శాఖ ఏడి రోహిణి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆమె మాట్లాడుతూ నెల రోజులపాటు ఈ వ్యాధి నివారణ టీకాల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఆగష్ట్ 31 వరకు మదనపల్లె,నిమ్మనపలి ,,రామసముద్రం మండలాల పరిధిలోని అన్ని పంచాయతీలలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది నిర్వహిస్తారన్నారు. ఈ గడువులోగా మొత్తం డోసుల టీకాలను పాడిపశువులకు వేయాలని లక్ష్యంగా నిర్ధారించారు. ఈ సీజన్లో పశువులకు ముద్ద చర్మవ్యాధి సోకకుండా ఉండేందుకు పశువుల పాకల్లో రాత్రి వేళల్లో వేపాకు పొగవేయాలని సూచించారు. దీనివల్ల ఈగలు,దోమలు పశువుల వద్దకు రాకుండా నివారించవచ్చని,తద్వారా పశువులను వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. చర్మంపై చిన్నచిన్న గడ్డలు లేదా నోడ్యూల్స్ ఏర్పడటం ఆ తర్వాత అవి పగిలి రక్తం కారడం లేదా పుండ్లు కావడం,పశువులకు అధిక జ్వరం ఉండటం,కళ్ల నుండి నీరు కారుతూ ఉండటం,చర్మం కింద ఉండే శోషరసకణుపుల వాపు,ఆకలి మందగించడం,పాల దిగుబడి గణనీయంగా తగ్గడం,కావున పాడి రైతులు వెంటనే సమీప రైతుసేవా కేంద్రాలు,గ్రామీణ పశువైద్యశాల సిబ్బంది ద్వారా తప్పనిసరిగా పాడిపశువులకు టీకాలు వేయించుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గంలోని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఘనంగా శ్రీ చైతన్య జూనియర్ కాలేజీ పేరెంట్స్ సమావేశం





### -విద్యార్థుల భవిష్యత్తుకు దిశానిర్దేశం

**కాకినాడ జిల్లా (ప్రజా సీమ )**

గొల్లప్రోలు,కాకినాడ శ్రీ చైతన్య జూనియర్ కాలేజీ రామన్ భవన్ క్యాంపస్లో శనివారం తల్లిదండ్రుల సమావేశం (పేరెంట్స్ మీటింగ్) నిర్వహించారు. విద్యార్థుల విద్యా ప్రగతి వారి ఉజ్వల భవిష్యత్తే ధ్యేయంగా ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ చైతన్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం హరిప్రసాద్ పర్యవేక్షణలో కాకినాడ ఏజీఎం రాంబాబు సారథ్యంలో అత్యంత క్రమశిక్షణతో విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా కాలేజీ అధ్యాపకులు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు అనుసరించాల్సిన పాఠ్యప్రణాళిక గురించి తల్లిదండ్రులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. విద్యార్థుల చదువుల్లో వస్తున్న మార్పులు,సాధించాల్సిన లక్ష్యాలపై విశ్లేషించారు. పిల్లల భవిష్యత్తును ఏ విధంగా తీర్చిదిద్దాలో వివరిస్తూ, తల్లిదండ్రులు ఇంట్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కీలకమైన అకాడమిక్ సూచనలు, దిశానిర్దేశం చేశారు. ఈ మీటింగ్కు తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన లభించింది. సుమారు 234 మంది విద్యార్థుల తల్లిదండ్రులు ఈ సమావేశంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. తమ పిల్లల చదువు, ప్రవర్తన,మార్కుల గురించి అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. కాలేజీ యాజమాన్యం తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ పట్ల తల్లిదండ్రులు పూర్తి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. శ్రీ చైతన్య రామన్ భవన్ క్యాంపస్ ప్రిన్సిపాల్ ,వైస్ ప్రిన్సిపాల్,బోధన సిబ్బంది బోధనేతర సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేశారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా శ్రీ చైతన్య యాజమాన్యం పనిచేస్తోందని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

# ప్రమాదకరంగా గొల్లప్రోలు మెయిన్ రోడ్డు





### -పట్టించుకోని అధికారులు

### -మండిపడుతున్న ప్రజలు

**కాకినాడ జిల్లా (ప్రజా సీమ )**

గొల్లప్రోలు మెయిన్ రోడ్డు పూర్తిగా ధ్వంసమై గోతులమయంగా మారిన సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందలాది వాహనాలు ప్రయాణించే ఈ ప్రధాన రహదారిపై ప్రయాణం అంటేనే వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గడచిన కొన్ని నెలలుగా రహదారిపై ప్రమాదకరమైన గోతులు ఏర్పడినా అధికారులు కనీసం మరమ్మతులు కూడా చేయకపోవడంపై ప్రజలు, వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ శివారు ఎంపీడీవో కార్యాలయం సమీపంలోనూ,పాత బస్టాండ్ వద్ద రహదారిపై భారీ గోతులు ఏర్పడ్డాయి. ముఖ్యంగా ఎంపీడీవో కార్యాలయం వద్ద రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతలు ప్రమాదకరంగా మారాయి. ఈ గోతుల్లోకి వర్షపు నీరు చేరి నిలిచిపోవడంతో గుంతలు పడిన విషయం తెలియక వాహనదారులు, మోటార్ సైకిల్ పై వెళ్లేవారు రహదారి అనుకుని ఆ గోతుల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. పగటిపూట ఎలాగోలా తప్పించుకుని వెళు న్నప్పటికీ, రాత్రి సమయాల్లో ఈ గోతులు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురై గాయపడుతున్నారు. ఫ్యామిలీతో మోటార్ సైకిల్ పై ప్రయాణించే వారు అయితే మరింత ఇబ్బందులకు గురవుతున్నారని స్థానికులు తెలిపారు. గొల్లప్రోలు రహదారిపై నెలల తరబడి గోతులు ఏర్పడినా అధికారులు పట్టించుకోకపోవడంపై టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రధాన మెయిన్ రోడ్డు మరమ్మతులకు గురైనప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై ఆయన మండిపడ్డారు. ఈ రహదారి నిర్మాణం చేపట్టి చాలా కాలం అవుతున్నందున కేవలం తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా గోతులమయంగా మారిన గొల్లప్రోలు మెయిన్ రోడ్డును నూతనంగా నిర్మించి ప్రజలను ప్రమాదాల బారి నుండి కాపాడాలని అధికారులను కోరుతున్నారు.

# మన దారం - మన గౌరవం అవార్డ్స్.

### దేశ విదేశాల నుండి ప్రముఖులు హాజరు.

### చేనేత వస్త్రాలతో మెగా ఫ్యాషన్ షో...

**(ప్రజా సీమ ).**

చేనేత కళలను ప్రోత్సహిస్తూ పోషిస్తున్న కుటుంబాలను, సొసైటీలను గుర్తించి వారికి మన దారం మన గౌరవం అవార్డ్స్ 2026 తో ఘనంగా సత్కరించనున్నట్లు ఏ ఏ ఆర్ వి వి వల్లభనేని సంస్థల చైర్మన్ వల్లభనేని గోపీచంద్, ఫ్యాషన్ ఫౌండర్ హబ్ చైర్మన్ వల్లభనేని అరుణ తెలిపారు. శనివారం కాకినాడ రూరల్లో ఉన్న తన స్వగృహం నందు కార్యక్రమం పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని కాకినాడ రూరల్ నడకుదురు గ్రామంలో కుసుమ సత్య ఫంక్షన్ హాల్ నందు నేడు సాయంత్రం ఘనంగా నిర్వహిస్తున్నమన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా ప్రముఖ సాఫ్ట్వేర్ సంస్థల అధినేత, వ్యాపారవేత్త గుత్తా వెంకట్, విదేశాలకు చెందిన పిలిపిన్స్ దేశ గౌరవ సలహాదారులు, వ్యాపారవేత్త, సామాజికవేత్త మాజీ మిస్ జెన్నీ లీన్ జి మానో, దుబాయ్ నుండి ప్రముఖ వ్యాపారవేత్త సామాజికవేత్త డాక్టర్ కబీర్ తో తోపాటు విదేశీ మిస్ లు పాల్గొంటారని తెలిపారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా చేనేత ప్రముఖులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు కార్పొరేషన్ చైర్మన్ విచ్చేస్తారని తెలిపారు. ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు పప్పు రమేష్ సహకారతో నిర్వహిస్తున్నమన్నారు. "మన దారం - మన గౌరవం" నినాదంతో ఎన్నో సంవత్సరాలుగా భారతీయ చేనేత



కలలను, ఆంధ్రప్రదేశ్ చేనేత వస్త్రాలను అంతర్జాతీయ వేదికలపై ఫ్యాషన్ రంగంలో ప్రదర్శిస్తూ, ప్రోత్సహిస్తూ వారికి అండగా ఉంటున్నామన్నారు. వారి ఉపాధి అవకాశాలను, ఆర్థిక స్వయం సాధికారత, అంతర్జాతీయంగా వారు ఉత్పత్తులను ఎగుమతి చేయటానికి వల్లభనేని స్టూడియోస్, ఫ్యాషన్ ఫౌండర్స్ హబ్ అధినేత అరుణ శ్రీ చేస్తున్న కృషిలో భాగంగా ఈ కార్యక్రమం చేస్తున్నామన్నారు. చేనేత కళలను ప్రోత్సహిస్తూ పోషిస్తున్న కుటుంబాలను, సొసైటీలను గుర్తించి వారికి అవార్డులను, ఈ చేనేత రంగంలో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు జీవిత సాఫల్య అవార్డులతో సత్కరిస్తున్నామని తెలిపారు.

ప్రజాసీమ

## కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రచరిత్రలో సువర్ణ అధ్యాయం

**- 32వ వార్డ్ ఇంచార్జి మండిపల్లి మధుసూదన్ రెడ్డి స్పష్టం**

మదనపల్లె (ప్రజా సీమ)

రాష్ట్ర అభివృద్ధి,ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని 32వ వార్డ్ ఇంచార్జి మండిపల్లి మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు.ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా ఆదేశాల మేరకు శనివారం 32వ వార్డు పరిధిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ,ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు.ముఖ్యంగా తల్లికి వందనం,అన్నదాత సుఖీభవ,ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు,స్త్రీ శక్తి,ఎన్టీఆర్ గృహకల్ప,అన్నా క్యాంటీన్లు వంటి పథకాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు.రాష్ట్రానికే తలమానికమైన అమరావతి,పోలవరం పనులు శరవేగంగా జరుగుతున్నాయని,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన అనుభవంతో ఏపీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ప్రశంసించారు.ఇక మదనపల్లి నియోజకవర్గంలో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచి చరిత్ర సృష్టించిన షాజహాన్ బాషా ప్రజారంజక పాలనతో అందరి అభిమానాన్ని చూరగొంటున్నారని కొనియాడారు.ఆయన సారధ్యంలో నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి వెంకటేష్,ఆదినారాయణ,బొమ్మిశెట్టి సురేంద్ర,గడ్డం సురేష్,కాల నాగభూషణ,బీఎల్ఏలు వెంకటేష్,ముద్దుకృష్ణ,కాల నాగరాజ,వెంకటరమణ,బొమ్మిశెట్టి విశ్వనాథ్,సాయి,బూత్ ఇన్చార్జులు,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా బలోపేతమే లక్ష్యం

**తాడేపల్లిలో రాష్ట్రస్థాయి ముఖ్య సమావేశం హాజరైన జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ ఉబేదుల్ల..**

పీలేరు ప్రజాసీమ :

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విభాగాన్ని మరింత బలోపేతం చేసి, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రచారం చేయాలనే లక్ష్యంతో శనివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోషల్ మీడియా విభాగ ముఖ్య సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల సోషల్ మీడియా బాధ్యులతో ఆయన పార్టీ కార్యక్రమాలు, సోషల్ మీడియా వ్యూహాలు, డిజిటల్ ప్రచార విధానం, ప్రజా సమస్యలను సమర్థవంతంగా ప్రజలకు చేరవేసే అంశాలపై సమీక్ష నిర్వహించారు.సోషల్ మీడియా కార్యకర్తలు పార్టీ అధికారిక సమాచారాన్ని మాత్రమే ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అసత్య ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని, పార్టీ కార్యక్రమాలు, నాయకుల సందేశాలను వేగంగా ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషించాలని సూచించినట్లు సమాచారం.ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ ఉబేదుల్ల పాల్గొన్నారు.సమావేశంలో పార్టీ సోషల్ మీడియా విభాగానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేసినట్లు ఆయన తెలిపారు.సమావేశంలో రాష్ట్ర, ప్రాంతీయ, జిల్లా స్థాయి సోషల్ మీడియా బాధ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని సంస్థాగత బలోపేతం, డిజిటల్ ప్రచార విస్తరణ, పార్టీ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసే అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారని ఉబేదుల్లా తెలిపారు.



## ఘనంగా జనసేన నేత కలప రవి జన్మదిన వేడుకలు. కూటమి నేతలు, కార్యకర్తల సమక్షంలో అన్నదానం.

పీలేరు ప్రజాసీమ :

జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి, పీలేరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కలప రవి జన్మదిన వేడుకలు శనివారం పీలేరు మార్కెట్ యార్డ్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కలప రవికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమానికి పీలేరు మార్కెట్ యార్డ్ చైర్మన్ పురం రామమూర్తి ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి కలప రవికి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం అక్కడికి వచ్చిన నాయకులు, కార్యకర్తలకు కేక్ కట్ చేసి శాలువాతో సత్కరించి, ఆయన ప్రజా సేవ మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పురం రామమూర్తి మాట్లాడుతూ, కలప రవి పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుడని కొనియాడారు.ప్రజలతో సన్నిహితంగా ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.జన్మదిన వేడుకల్లో భాగంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రజలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నదానాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ కలప రవికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# అందుబాటు ధరల్లో ప్రజలకు నాణ్యమైన బియ్యం

**పీలేరులో నాణ్యమైన సబ్సిడీ బియ్యం విక్రయాలు ప్రారంభం**

**-- ప్రతి రేషన్ కార్డు కుటుంబానికి 10 కిలోలు: ఆర్డీవో విజయలక్ష్మి**

పీలేరు ప్రజాసీమ :

నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు ఊరటనిచ్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీ ధరలకు నాణ్యమైన బియ్యం విక్రయాలను శుక్రవారం నుంచి ప్రారంభించింది. పీలేరులో ఏర్పాటు చేసిన ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాన్ని పీలేరు ఆర్డీవో విజయలక్ష్మి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆర్డీవో విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని అందుబాటు ధరల్లో అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 130 రైతు బజార్లు మరియు 500 రైస్ మిల్లర్ల వద్ద ప్రత్యేక కౌంటర్ల ద్వారా బియ్యం విక్రయాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్కెట్‌లో అధిక ధరకు విక్రయమవుతున్న బీపీటీ సూపర్ ఫైన్ గ్రేడ్-1 బియ్యాన్ని కిలో రూ.52కే, అలాగే పచ్చి బియ్యాన్ని (రా రైస్) కిలో రూ.50కే అందిస్తున్నట్లు వివరించారు.రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి 10 కిలోల బియ్యం అందజేయనున్నట్లు తెలిపారు. పంపిణీ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలకు నాణ్యత కలిగిన బియ్యాన్ని మాత్రమే అందిస్తామని స్పష్టం చేశారు.పెరుగుతున్న మార్కెట్ ధరల నేపథ్యంలో ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ నిర్ణయం సామాన్య ప్రజలకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని పేర్కొన్నారు.పంపిణీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు మొబైల్ యాప్‌లో అవసరమైన సాంకేతిక మార్పులు, చేర్పులు చేపడుతున్నట్లు ఆర్డీవో తెలిపారు. మార్పులు పూర్తయిన అనంతరం సవరించిన మొబైల్ యాప్ లింక్ సంబంధిత అధికారులకు అందజేస్తామని, అప్పటి వరకు అధికారులు ప్రస్తుత మార్గదర్శకాల ప్రకారం పంపిణీ చేపట్టాలని సూచించారు. సవరించిన విధానాన్ని సంబంధిత అధికారులు గమనించి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా నాణ్యమైన బియ్యం తక్కువ ధరకే లభించడం వల్ల కుటుంబాల ఆర్థిక భారం కొంత మేర తగ్గుతుందని ఆర్డీవో పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ సబ్సిడీ బియ్యాన్ని కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పీలేరు తహశీల్దార్ శివకుమార్, మార్కెట్ యార్డ్ చైర్మన్ పురం రామమూర్తి, సీఎస్‌డీటీ అధికారులు, పౌర సరఫరాల శాఖ సిబ్బంది, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం కుటుంబ బడ్జెట్‌కు గణనీయమైన ఊరటనిస్తుందని తెలిపారు.ధరల పెరుగుదలతో ఇబ్బంది పడుతున్న ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన సబ్సిడీ బియ్యాన్ని కొనుగోలు చేయాలని పిలుపునిచ్చారు.




## దేవలపల్లి హెచ్‌పీసీఎల్ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆర్డీవో విజయలక్ష్మి..

**సేవల నాణ్యత, రికార్డుల నిర్వహణపై పరిశీలన - అధికారులకు పలు సూచనలు**

కలకడ ప్రజాసీమ :

అన్నమయ్య జిల్లా కలకడ మండలంలోని దేవలపల్లి గ్రామంలో ఉన్న హెచ్‌పీసీఎల్ (నూజా) కేంద్రాన్ని పీలేరు రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) ఎస్. విజయలక్ష్మి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కేంద్రంలో సేవలు అందుతున్నాయా, రికార్డుల నిర్వహణ, ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలు, భద్రతా ప్రమాణాలు తదితర అంశాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు.తనిఖీ సందర్భంగా కేంద్రంలోని స్టాక్ వివరాలు, నిర్వహణ విధానం, సంబంధిత రికార్డులు, వినియోగదారులకు అందిస్తున్న సేవల నాణ్యతపై ఆరా తీశారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సేవలు అందించాలని, ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత నిర్వాహకులకు సూచించారు.అలాగే రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి సక్రమంగా నిర్వహించాలని, భద్రతా ప్రమాణాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడం ప్రతి సంబంధిత శాఖ బాధ్యత అని పేర్కొన్నారు.ఈ తనిఖీలో కలకడ తహశీల్దార్ మహేశ్వరి బాయి, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో కేంద్రంలోని వివిధ అంశాలను పరిశీలించారు.అవసరమైన చోట మెరుగుదల చర్యలు చేపట్టి, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సేవలు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ప్రభుత్వ సేవలు ప్రజలకు పారదర్శకంగా, నాణ్యతతో అందేలా ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు.




## ఏనుగొండపాలెంలో రీ-సర్వే పనులకు భూమిపూజ..








**ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి శ్రీకారం -- గ్రామ సభ నిర్వహించిన తహశీల్దార్ మహేశ్వరి బాయి..**

కలకడ ప్రజసీమ :

అన్నమయ్య జిల్లా కలకడ మండలంలోని ఏనుగొండపాలెం గ్రామం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న ప్రతిష్ఠాత్మక భూ రీ-సర్వే కార్యక్రమం కోసం ఎంపికైంది. ఈ నేపథ్యంలో శనివారం గ్రామంలో రీ-సర్వే పనులకు భూమిపూజ నిర్వహించి, అనంతరం గ్రామ సభను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కలకడ తహశీల్దార్ ఎస్. మహేశ్వరి బాయి ముఖ్య అతిథిగా హాజరై రీ-సర్వే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, భూములపై స్పష్టమైన హక్కులు కల్పించడం, భూ రికార్డులను ఆధునీకీకరించడం, భవిష్యత్తులో భూ వివాదాలను తగ్గించడం, రైతులు మరియు భూ యజమానులకు పారదర్శకమైన సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రీ-సర్వే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.రీ-సర్వే ప్రక్రియలో గ్రామ ప్రజలు అధికారులకు పూర్తి సహకారం అందించాలని, తమ భూములకు సంబంధించిన పాత పత్రాలు, రికార్డులు, వివరాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి భూ యజమాని తన భూమి వివరాలను పరిశీలించి, ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే రెవెన్యూ అధికారులను సంప్రదించాలని సూచించారు.అనంతరం నిర్వహించిన గ్రామ సభలో రీ-సర్వే ప్రక్రియ, భూముల కొలతలు, డిజిటల్ రికార్డుల తయారీ, ప్రభుత్వ మార్గదర్శకాలు, ప్రజలు పాటించాల్సిన విధానాలపై అధికారులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామ ప్రజలు అడిగిన సందేహాలకు అధికారులు సమాధానాలు ఇచ్చి, పారదర్శకంగా రీ-సర్వే నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది, గ్రామ రెవెన్యూ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, రైతులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిస్వార్ధ ప్రజాసేవకుడు వైకాపా నేత ఎస్.ఏ కరీముల్లా






**- జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సత్యప్రసాద్,వైసీపి నాయకులు**

మదనపల్లె (ప్రజా సీమ)

: వర్ధమాన రాజకీయాల్లో వైకాపా మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఏ కరీముల్లా నిస్వార్ధ ప్రజా సేవకుడని సత్యనారాయణ మెడికల్స్ అధినేత సత్యప్రసాద్ పేర్కొన్నారు.శనివారం ఎస్.ఏ కరీముల్లా జన్మదిన వేడుకలు ఆయన కార్యాలయంలో ఘనంగా జరిగాయి.ఇందులో భాగంగా సత్యప్రసాద్ ఆయనను శాలువతో సన్మానించి,పుష్పగుచ్ఛం అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సత్య ప్రసాద్ మాట్లాడుతూ వైఎస్సార్సీపీలో అంచలంచెలుగా రాష్ట్రస్థాయి నేత వరకు ఎదగడం ఆయన క్రమశిక్షణ, నిబద్ధతకు నిదర్శనమన్నారు.గతంలో వక్ఫ్ బోర్డు చైర్మనుగా ఆయన సతీమణి షేక్ షబానా 14 వార్డ్ కౌన్సిలరుగా ప్రజలు విశేష సేవలు అందించారన్నారు.మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి,మాజీ మంత్రి పెద్దిరెడ్డి,ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి,ఎమ్మెల్యే ద్వారకనాథ్ రెడ్డి,ఇతర ముఖ్యనేతలతో సత్సంబంధాలు కలిగి ఉండడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు.నిరంతరం ప్రజాశ్రేయస్సు పరితపించే ఎస్.ఏ కరీముల్లా ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ,భవిష్యత్తులో రాజకీయంగా ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు.కాగా ఎస్.ఏ కరీముల్లాకు వైఎస్సార్సీపీ నాయకులు,కార్యకర్తలు,మిత్రులు,శ్రేయోభిలాషులు పెద్దఎత్తున పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.


ప్రజాసేవ

# కొరియన్ కనకరాజు ట్రైలర్ విడుదల




వరుణ్ తేజ్ కథానాయకుడిగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు'. రితిక నాయక్ కథానాయిక. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ఆగస్టు 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం మూవీ ట్రైలర్‌ను విడుదల చేసింది. థ్రిల్, హాస్యం, హారర్ అంశాలను మేళవించి మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించారు. సత్య కీలక పాత్ర పోషిస్తున్న ఈమూవీకి తమన్ మ్యూజిక్ అందిస్తున్నారు. కొరియన్ కనకరాజు పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్, పాటలు ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని కలిగించగా.. తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై ఉన్న హైప్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. తాజా ట్రైలర్‌ను బట్టి చూస్తే.. ఈ సినిమా పూర్తి స్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందినట్లు తెలుస్తోంది. అనంతపురానికి చెందిన ఓ సాధారణ యువకుడు, కొరియన్ మాఫియా ప్రపంచం మధ్య జరిగే ఆసక్తికర పరిణామాలే కథకు ప్రధాన బలంగా కనిపిస్తున్నాయి. హారర్, కామెడీ, యాక్షన్ అంశాలను దర్శకుడు మేర్లపాక గాంధీ వినోదాత్మకంగా రూపొందించినట్టు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ రెండు విభిన్న షేడ్స్‌లో కనిపించనున్నట్లు ట్రైలర్ సూచిస్తోంది. ఒకవైపు అనంతపురం యువకుడిగా మాస్ బాడీ లాంగ్వేజ్‌తో అలరిస్తూనే, మరోవైపు కొరియన్ మాఫియా డాన్ పాత్రలో స్టైలిష్ లుక్, స్వాగ్‌తో ఆకట్టుకున్నారు. రెండు పాత్రలకు భిన్నమైన హావభావాలు, బాడీ లాంగ్వేజ్, మేకోవర్‌తో వరుణ్ తేజ్ చూపించిన వైవిధ్యం అభిమానులను ఆకట్టుకుంటోంది. ట్రైలర్‌లో నటుడు సత్య చెప్పిన పంచ్ డైలాగులు నవ్వులు పూయిస్తున్నాయి. ఆయన కామెడీ టైమింగ్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని ట్రైలర్‌ను చూసిన ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. హీరోయిన్ రిథికా నాయక్ తన గ్లామర్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటలు మంచి ఆదరణ పొందగా, ట్రైలర్‌లో ఎస్. థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మరింత ఉత్సాహాన్ని కలిగిస్తోంది. ముఖ్యంగా యాక్షన్, హారర్ సన్నివేశాల్లో థమన్ సంగీతం సినిమాకు అదనపు బలంగా కనిపిస్తోంది. ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ట్రైలర్‌లో కనిపించిన విజువల్స్, సెట్స్, సాంకేతిక నాణ్యత సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కించినట్లు తెలియజేస్తున్నాయి.ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న 'కొరియన్ కనకరాజు' ఇప్పటికే మంచి పాజిటివ్ బజ్‌ను సొంతం చేసుకుంది. ట్రైలర్ విడుదల తర్వాత సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు మరింత పెరిగాయి. హారర్, కామెడీ, యాక్షన్, ఎమోషన్‌లతో కూడిన పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.

# జూలో రెండు జంతువులను దత్తత తీసుకున్న అన్నా కొణిదెల



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా కొణిదెల (అన్నా లెజినోవా) మరోసారి తన సేవా దృక్పథంతో ప్రశంసలు అందుకుంటున్నారు. గత కొంతకాలంగా సోషల్ మీడియాలో చురుకుగా ఉంటున్న ఆమె.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల తనకున్న గౌరవాన్ని తరచూ పంచుకుంటూ అభిమానులకు మరింత చేరువవుతున్నారు.రష్యాలో జన్మించినప్పటికీ భారతీయ ఆచారాలను పాటిస్తూ పూజలు, పండుగలు, కుటుంబ వేడుకల్లో సంప్రదాయ దుస్తులతో కనిపించే అన్నా కొణిదెలకు ఇప్పటికే సోషల్ మీడియాలో మంచి ఆదరణ ఉంది. ఇప్పుడు ఆమె తీసుకున్న మరో నిర్ణయం అందరి ప్రశంసలను అందుకుంటోంది. తాజాగా అన్నా కొణిదెల హైదరాబాద్ నెహ్రూ జూలాజికల్ పార్క్‌లోని రెండు జంతువులను దత్తత తీసుకున్నారు. అందులో ఒకటి ఆసియా ఏనుగు, మరొకటి రాయల్ బెంగాల్ టైగర్. ఈ జంతువుల ఆహారం, వైద్య సంరక్షణతో పాటు ఇతర నిర్వహణ ఖర్చులను ఇకపై ఆమె భరిస్తారని సమాచారం. జూ పార్క్‌లో ఆయా జంతువుల వద్ద అన్నా కొణిదెల దత్తత తీసుకున్నట్లు ప్రత్యేక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ఇంతకుముందు పవన్ కళ్యాణ్ కూడా విశాఖపట్నం జూలో జిరాఫీలను దత్తత తీసుకుని జంతు సంరక్షణకు తన వంతు సహకారం అందించారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో అన్నా కొణిదెల కూడా ముందుకు రావడం అభిమానులను ఆకట్టుకుంటోంది.


❤️ Pawan Kalyan & Anna Konidela Beautiful Couple Moments 🥰

# 9న మహేశ్ బాబు పుట్టిన రోజు వారణాసి నుంచి అప్‌డేట్ కోసం అభిమానుల చూపు

సూపర్ స్టార్ మహేష్ బాబు అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే నెల ఆగస్టు వచ్చేసింది. ప్రతి ఏడాది ఆగస్టు 9న మహేష్ పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియాలో భారీ స్థాయిలో సందడి నెలకొంటుంది. ఈసారి కూడా అభిమానులు ఎస్-ఎస్ఎంబీ మంత్ పేరుతో సెలబ్రేషన్స్ ప్రారంభించగా, అందరి దృష్టి ఇప్పుడు ఒకే విషయంపై ఉంది.. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వారణాసి' సినిమా నుంచి ఏదైనా ప్రత్యేక అప్‌డేట్ వస్తుందా అని చూస్తున్నారు. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి' ప్రస్తుతం భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ప్రాజెక్ట్‌లలో ఒకటిగా నిలిచింది. అడ్వెంచర్ నేపథ్యంలో భారీ బ్జడెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రంపై దేశవ్యాప్తంగా మాత్రమే కాదు, అంతర్జాతీయ స్థాయిలో కూడా ఆసక్తి నెలకొంది. మహేష్ బాబు కూడా ఈ సినిమా కోసం పూర్తిగా కొత్త లుక్, ప్రత్యేకమైన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌తో కనిపించనున్నట్లు సమాచారం. చిత్ర బృందం ఇప్పటికే సినిమా షూటింగ్‌లో కీలక భాగాన్ని పూర్తి చేసినట్లు సమాచారం. ప్రస్తుతం మరికొన్ని భారీ యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ కొనసాగుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. సినిమా లుక్ గోప్యంగా ఉండేలా రాజమౌళి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారని, అందుకే మహేష్ బాబు ఇటీవల కాలంలో పబ్లిక్ ఈవెంట్లకు కూడా చాలా తక్కువగా హాజరవుతున్నారని తెలుస్తోంది. మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆయన సినిమాలకు సంబంధించిన పోస్టర్, టీజర్ లేదా గ్లింప్స్ విడుదల చేయడం గత కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా 'వారణాసి' నుంచి ప్రత్యేక అప్‌డేట్ ఉంటుందనే ఆశతో అభిమానులు ఎదురుచూస్తున్నారు.

# టాక్సిక్


## ట్రైలర్ 8న గ్రాండ్‌గా విడుదల

కన్నడ రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్ వరల్డ్ మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా ఒక అదిరిపోయే అప్డేట్ అందించారు. సినిమా ప్రమోషన్స్ లో భాగంగా చిత్ర యూనిట్ తాజాగా ట్రైలర్ రిలీజ్ డేట్ ను అధికారికంగా ప్రకటించడంతో పాటు, ఒక సరికొత్త పోస్టర్ ను విడుదల చేసి సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చారు. గీతూ మోహన్ దాస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈ సాలిడ్ యాక్షన్ డ్రామాపై ఇప్పటికే సినీ వర్గాలలో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. రీసెంట్ గా రామాయణ ప్రాజెక్ట్ తో పాటు రావణాసురుడి పాత్రలో యష్ గెటప్ మరియు ప్రెజెన్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ సినిమా కంటే ముందే బాక్సాఫీస్ ముందుకు రాబోతున్న 'టాక్సిక్' తో యష్ ఏ స్థాయిలో విధ్వంసం సృష్టిస్తాడనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో తాజాగా విడుదల చేసిన బ్లాక్ అండ్ వైట్ పోస్టర్ సినిమా మూడ్ ఏంటో స్పష్టంగా తెలియజేస్తోంది. ఈ పోస్టర్ తో పాటు మేకర్స్ అనౌన్స్ చేసిన వివరాల ప్రకారం, ఈ భారీ బ్జడెట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమా ట్రైలర్ ను వచ్చే ఆగస్టు 8 న అత్యంత గ్రాండ్ గా లాంచ్ చేయనున్నారు. ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి వంటి స్టార్ హీరోయిన్లు, నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ (మరియు మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్)సంయుక్తంగా అత్యంత భారీ బ్జడెట్ తో ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఇక కేజీఎఫ్ లాంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత కేవీఎన్ ప్రొడక్షన్స్ తో యష్ చేస్తున్న ఈ ప్రాజెక్ట్ పై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలున్నాయి.










Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma